

భూసేకరణ వేగిరం చేయాలి...

- మూడో రైల్వేలైన్, గ్రీన్‌ఫీల్డ్‌కు మిగిలిన భూ సేకరణ చేయాలి
- మున్నేరు రిటైనింగ్ వాల్ కోసం 190.16 ఎకరాలు సేకరించాలి
- అధికారులతో సమీక్షలో కలెక్టర్ గౌతమ్

6

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

భద్రాద్రి కొత్తగూడెం

5

శనివారం, 15 జూన్ 2024





భద్రాచలం, జూన్ 14 : భద్రాచలంలోని శ్రీసీతారామచంద్ర స్వామి వారు శుక్రవారం సందర్భంగా స్వర్ణ భద్ర కవచాలతో భక్తులకు దర్శనమివ్వగా అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామివారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. వేద పండితులు విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనం నిర్వహించారు.

స్వర్ణ కవచాలతో దర్శనమిచ్చిన భద్రాద్రి రామయ్య



భద్రాద్రి రామాలయ పరిసరాల్లో నిలిచిన వర్షపు నీరు

భద్రాద్రిలో దంచికొట్టిన వర్షం

- 5.8 సెం.మీ. వర్షపాతం నమోదు
- నేలకొరిగిన చెట్లు, విద్యుత్‌స్తంభాలు
- నీట మునిగిన నిత్యన్నదానం సత్రం

6



మృతి చెందిన వెంకటలక్ష్మి, దుర్గయ్య

'కూలి'పోయిన బతుకులు

- మామిడి మొక్కల ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ
- ఇద్దరు మృతి.. 14 మందికి గాయాలు
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఘటన

6



కొనగలమా.. తినగలమా..

- ఘాటెక్కిన ఉల్లి.. కొండెక్కిన టమోటా..
- కిలో టమోటా రూ. 70-80
- రూ.50కు చేరిన ఉల్లి ధర

6

6

గోదావరి జలాలు ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయాలని మూడు దశాబ్దాలుగా కంటున్న కల ఎప్పుడు ఫలిస్తుందోనని ఉమ్మడి జిల్లా రైతులు కొండంత ఆశతో ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా ప్రాజెక్టులో మార్పులు రావడం... నిధుల మంజూరులో జాప్యం జరగడం.. పర్యవేక్షణ లోపం.. తదితర కారణాల వల్ల గోదావరి జలాలు జిల్లాకు అందడం లేదు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు గురువారం సీతారామ ప్రాజెక్టును, గోదావరి నుంచి లిఫ్టు ఇరిగేషన్లను, 60కి.మీ. కెనాల్ పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. ప్రాజెక్టును వినియోగంలోకి తెస్తామని భరోసా ఇవ్వడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.



- 2004 నుంచి అనేక మలుపులు
- రూ.2 వేల కోట్ల నుంచి రూ.15 వేల కోట్లకు చేరిన అంచనా వ్యయం
- ఎన్నెస్పీ ఆయకట్టుకు గోదావరి జలాలను అందించేలా ప్లాన్
- 10 లక్షల ఎకరాల ఆయకట్టు సస్యశ్యామలమే లక్ష్యం
- ఇంకా కొనసాగుతున్న లింక్ కెనాల్, టన్నెళ్ల నిర్మాణ పనులు
- ప్రాజెక్టు పూర్తికి మరో రూ.8వేల కోట్లు అవసరం

'సీతారామ' దశ మారేనా...!?

ఖమ్మం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి రాష్ట్రంలో టీడీపీ హయాంలో భారీ నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్న తుమ్మల దుమ్ముగూడెం పేరుతో ప్రాజెక్టుకు ప్రతిపాదనలు, డిజైన్లు చేశారు. 2004లో టీడీపీ ఓటమి తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో దుమ్ముగూడెం ప్రాజెక్టు రెండుగా చీలింది. మొదట రూ.2వేల కోట్లతో ప్రతిపాదనలు చేయగా.. ఆ తర్వాత రూ.3600కోట్లతో రాజీవ్, ఇందిరాసాగర్ పేరుతో దుమ్ముగూడెం, రుద్రంకోట వద్ద లిఫ్టు ఇరిగేషన్లు పెట్టాలని ప్రతిపాదించి పనులు చేపట్టారు. సుమారు రూ.2వేల కోట్లు ఖర్చుపెట్టి మోటార్లు, పైపులు కొన్నారు. 4లక్షల ఎకరాలకు నీరందించాలని రూ.3600కోట్లతో మంజూరు చేసిన ఈ పనుల్లో కొంత పైపులైన్ల పనులు చేపట్టారు. హెడ్‌వర్క్స్ పనులు మొదలు పెట్టలేదు. 1800 క్యూసెక్కుల నీరును వినియోగించుకునే లక్ష్యంతో రాజీవ్, ఇందిరాసాగర్‌లను ప్రతిపాదించారు. ఆ తర్వాత రాష్ట్ర విభజన జరగడంతో రుద్రంకోట

మంత్రుల పర్యటనతో చిగురిస్తున్న ఆశలు

వద్ద ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేసే ప్రాంతం ఏపీలోని పశ్చిమగోదావరి జిల్లాలోకి వెళ్లింది. చింతలపూడికి కూడా ఆయకట్టు ఏర్పాటుచేయగా మొత్తం ఆయకట్టులో 70వేల ఎకరాలు ఆంధ్రాకు వెళ్లింది. ఆ తర్వాత టీఆర్ఎస్ అధికారంలోకి రాగా, మళ్లీ తుమ్మల మంత్రి అయ్యారు. దీంతో దుమ్ముగూడెం ప్రాజెక్టు నిర్మించాలని తుమ్మల విజ్ఞప్తి మేరకు కేసీఆర్ రీ డిజైన్ చేయించారు. ఉమ్మడి జిల్లాతో పాటు మహబూబాబాద్ జిల్లా కలుపుకొని 10లక్షల ఎకరాలకు సాగునీరు, ఎన్ఎస్పీకి పాలేరు వద్ద అనుసంధానం చేసి కృష్ణా నీటితో సంబంధం లేకుండా సాగర్ ఆయకట్టును సస్యశ్యామలం చేయాలని భావించారు. రూ.15వేల కోట్లతో సీతారామ ఎత్తిపోతల పథకం కింద నామకరణం చేశారు. దీనిలో భాగంగా సుమారు రూ.7500 కోట్లు ఖర్చుపెట్టి ప్రధాన కాలువతోపాటు మూడు భారీ లిఫ్టులు ఏర్పాటు చేశారు. సత్తుపల్లి సమీపంలో టన్నెల్ నిర్మాణం కూడా మొదలు పెట్టారు. సుమారు 9 వేల క్యూసెక్కుల

(మిగతా 6వ పేజీలో)

అయినవారికి అందలం..

కానివారికి కట్టుదిట్టం...

- అక్రమ నిర్మాణాలపై స్థలాల యజమానులే ఫిర్యాదు చేయాలట
- నిర్మాణ అనుమతుల మంజూరులో నిబంధనలు బేఖాతర్
- భిన్నమైన సర్వే నెంబర్లలో నిర్మాణాలపై జాడలేని చర్యలు
- ఒక్కో సంఘటనలో ఒక్కో రకంగా అధికారుల స్పందన
- ఇంటిపన్ను తగ్గించారని వైరాలో సీనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్
- ఖమ్మంలో ప్రభుత్వ భూమికి ఇంటిపన్ను వేసిన అధికారులు మాత్రం విధుల్లోనే
- మాస్టర్‌ప్లాన్ మాయ చేసి అపార్ట్‌మెంట్లకు అనుమతులిచ్చిన మరో అధికారి

ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్‌లో అధికారుల రూటే సప'రేటు'





ఎంతో కష్టపడి సంపాదించిన సొమ్ముతో ప్లాట్లను కొనుగోలు చేసిన తర్వాత అటువైపు తిరిగి చూడటం లేదా..? అయితే జాగ్రత్తగా ఉండాల్సిందే మరి. ఎందుకంటే మీ స్థలంలో ఎవరైనా అక్రమంగా నిర్మాణం చేస్తున్నా మీరే ఫిర్యాదు చేయాలట. ఒకవేళ మీ స్థలంలో ఎవరైనా నిర్మాణం చేస్తే.. ఆ తర్వాత మీరు కోర్టుకు వెళ్లి తేల్చుకోవాల్సిందేనట. ఇది ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ (కేఎంసీ)లో కొందరు అధికారులు చెబుతున్న మాటలు. వాస్తవానికి నిర్మాణ అనుమతులు మంజూరు చేసే సమయంలో స్థలం డాక్యుమెంట్లు సక్రమంగా ఉన్నాయా? లేవా? సదరు స్థలం డాక్యుమెంట్లలో చూపించిన సర్వే నెంబర్లలోనే ఉందా? అది ప్రభుత్వ స్థలమా? వంటి అనేక అంశాలను పరిశీలించాలి. ఆ తర్వాత మాత్రమే అనుమతులు మంజూరు చేయాల్సి ఉంటుంది. కానీ అవేమీ పట్టించుకోకుండా ఎడాపెడా అనుమతులు జారీచేస్తున్నారు. అనుమతి పొందిన సర్వేనెంబర్‌లో కాకుండా మరో సర్వే నెంబర్ స్థలంలో నిర్మాణం చేపడుతున్నా నిద్ర నటిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పెద్ద ఎత్తున ముడుపులు పుచ్చుకొని నిర్మాణాలకే ఓకే అంటున్నారనే విమర్శలున్నాయి. ఖమ్మం నగర పరిధిలో చోటుచేసుకుంటున్న అనేక భూ వివాదాలకు కార్పొరేషన్ అధికారులే కారణమవుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం

వివరాలు : 6లో

అవి కుళ్లిన చికెన్ వింగ్స్...

- నగరంలో ప్రముఖ రెస్టారెంట్ బాగోతం
- పరీక్షల్లో నిర్ధారించిన నిపుణులు

ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 14: అవి రోడ్‌సైడ్ నిర్వహించే చిన్న చిన్న హోటళ్లు కావు.. మొబైల్ ఫుడ్ స్టాల్స్ కావు... నగరంలో అత్యంత పేరుమోసిన రెస్టారెంట్లు. హంగూ ఆర్భాటాలతో అవి ఆహార ప్రియులను ఆకట్టుకుంటాయి. వాటి బిల్డప్ చూస్తే శుచీ శుభ్రత మధ్య నాణ్యతతో కూడిన పదార్థాలతో ఫుడ్ ఐటమ్స్‌ను తయారుచేస్తారని ఎవరైనా నమ్ముతారు. కానీ లోన లొటారం వేరే లెవల్‌లో ఉంది. నాసిరకమైన చికెన్, కుళ్లిపోయి, వాసన వస్తున్న చికెన్ వింగ్స్‌ను పైపై మెరుగులతో ఆహారప్రియులకు అంటగడుతున్నారన్న వాస్తవం తాజాగా వెల్లడైంది.

రాష్ట్ర ఆహార తనిఖీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఆదేశాల మేరకు గత నెల 26న రాష్ట్ర ఆహార తనిఖీ సహాయ కమిషనర్ జ్యోతిర్మయి ఖమ్మం నగరంలో మూడు రెస్టారెంట్లపై దాడులు చేసిన విషయం విధితమే. వాటిలో ఒక రెస్టారెంట్ నుంచి వాసన అనుమానం ఉన్న చికెన్ వింగ్స్ శ్యాంపిల్స్ పరీక్షల కోసం హైదరాబాద్ ల్యాబ్‌కు తరలించారు. కాగా శుక్రవారం జిల్లా ఆహార తనిఖీ అధికారులకు నివేదికలు అందాయి. వాటిలో నిర్ఘాంతపోయే లోపాలు బయటపడ్డాయి. నాసిరకమైన చికెన్‌తోపాటుగా కుళ్లిపోయి, వాసన వస్తున్న చికెన్ వింగ్స్ అమ్మకాలు చేసినట్లు గుర్తించారు. వెంటనే కేసు నమోదు చేయాలని కలెక్టర్ కోర్టుకు రాష్ట్ర ఆహార నాణ్యతా ప్రమాణాల అధికారులు సిఫార్స్ చేశారు. ఉమ్మడి జిల్లాలో ఆహారం నాణ్యతపై ఎటువంటి అనుమానాలు ఉన్నా వెంటనే 90525 99915 నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ కోరారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. కాగా, నగరంలో దశాబ్దాలుగా రెస్టారెంట్లు నిర్వహిస్తూ కొత్త బస్టాండ్ ముందు మరో రెస్టారెంట్ ప్రారంభించిన నిర్వాహకులు సైతం ఆహార నాణ్యతా ప్రమాణాలను పట్టించుకోకపోవడం విస్తుగొలుపుతోంది.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

- అందరితో చర్చించిన తర్వాతే రైతుబంధుపై నిర్ణయం
- ప్రజా ప్రతినిధులు తమ అభిప్రాయాలను ప్రభుత్వానికి పంపాలి
- ఈ ఏడాది పక్కాగా పంటల బీమా పథకం అమలు
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల
- ఉత్సాహంగా సాగిన జడ్పీ సర్వ సభ్య సమావేశం
- అధికారుల తీరుపై సభ్యుల ప్రశ్నల పరంపర

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 14: పంట వేయని వాళ్లకు కూడా రైతుబంధు ఇవ్వడం వల్ల వాస్తవ రైతులకు, కౌలు రైతులకు ఇబ్బందులు ఎదురవుతాయని రైతు సంఘాలు, ప్రతినిధులు చెబుతున్నందున అందరితో చర్చించాకే తుది నిర్ణయం తీసుకుంటామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. జడ్పీ, మండల సమావేశాల్లో ప్రజాప్రతినిధులు తమ అభిప్రాయాలను తీర్మానంగా చేసి పంపిస్తే, శాసనసభలో చర్చించి వాస్తవ రైతులకు ప్రయోజనం కలిగేలా పథకాలను అమలు చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని పేర్కొన్నారు.

జిల్లా పరిషత్ అధ్యక్షుడు లింగాల కమల్‌రాజ్ అధ్యక్షతన శుక్రవారం జడ్పీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయం, విద్యాశాఖలపై అజెండాగా సభలో చర్చించారు. ఈ సందర్భంగా సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి తుమ్మల సమాధానమిస్తూ.. రాష్ట్రవ్యాప్తంగా రైతులకు ఉన్న ఇబ్బందులు కష్టాలు తనకు తెలుసన్నారు. పొలంలో విత్తనం నాటిన దగ్గరి నుంచి అమ్ముకునేంత వరకు రైతులు పడుతున్న కష్టాలు అన్ని ఇన్నీ కావన్నారు. అయితే ప్రభుత్వం రైతులకు ఈ సీజన్‌లో విత్తనాల నుంచి ఎరువులు పురుగుమందుల కొరత లేకుండా.. కల్తీలేనివి విక్రయించేలా కంపెనీలతో మాట్లాడి ఒప్పందం చేసుకున్నట్లు వివరించారు.

రైతుబంధు కింద సొమ్ములను సీజన్‌కు ముందే ఇస్తే బావుంటుందని సభ్యుల కోరిక మేరకు మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఇప్పటివరకు రూ.7500 కోట్లు రైతుబంధు కింద ఇచ్చామని అయితే వీటిపై విధివిధానాలను ఖరారు చేయనున్నట్టు చెప్పారు. పంటల బీమా పథకాన్ని ఈ ఏడాది పక్కాగా అమలు చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వమే పంటల బీమా ప్రీమియాన్ని కూడా చెల్లిస్తుందని స్పష్టం చేశారు.

రైతు రుణమాఫీ పథకం కూడా ప్రతి సారీ నాలుగు దఫాలుగా చేయడం వల్ల రైతులకు ప్రయోజనం కలగడం లేదని కేవలం వడ్డీకే సరిపోతుందని రైతులు.. రైతు సంఘాలు చెబుతున్నాయన్నారు. అలా కాకుండా ప్రభుత్వంపై భారమైనా ఒకేసారి రైతు రుణమాఫీ వర్తించేలా ప్రభుత్వం నిర్ణయాన్ని తీసుకుంటుందన్నారు.

తొలుత వ్యవసాయ శాఖ ప్రగతి నివేదికలను చదవగానే జీలుగులు, పిల్లి పెసర విత్తనాలను కోరిన రైతులకు అందించడం లేదని పెనుబల్లి, కారేపల్లి జడ్పీటీసీలు చెక్కిలాల మోహన్‌రావు, జగన్ ప్రశ్నించారు. రఘునాథపాలెం జడ్పీటీసీ ప్రియాంక విత్తనాల పంపిణీ కార్యక్రమాలకు ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వడం లేదని తెలిపారు. ముదిగొండ ఎంపీపీ సామినేని హరిప్రసాద్ మాట్లాడుతూ

(మిగతా 6వ పేజీలో)

బోగస్ ఆస్తి పత్రాలతో బురిడీ

- మహిళల సొత్తుతో ఉడాయించిన కేటుగాడు
- ఖమ్మం నగరంలో బాధితుల గోడు



7

ప్రేమ వంచనే బలి తీసుకుంది

- బలవన్మరణం చెందిన యువతి
- సూసైడ్ నోట్ లభ్యం







వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక, ఖమ్మం కలెక్టర్ గౌతమ్

పెండింగ్ ధరణి దరఖాస్తులను పరిష్కరించాలి

సీసీఎల్ఏ కమిషనర్ నవీన్‌మిట్టల్

కొత్తగూడెం, ఆంధ్రజ్యోతి/ ఖమ్మం కలెక్టరేట్, జూన్ 14 ధరణి పెండింగ్ దరఖాస్తులపై శుక్రవారం ఉదయం భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల కలెక్టర్లతో సీసీఎల్ సీసీఎల్ నవీన్‌మిట్టల్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఖమ్మం నుంచి జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్, అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, భద్రాద్రి నుంచి కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల, అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ పాల్గొన్నారు. ఈవీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలో ఎన్ని దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.. తాజా దరఖాస్తులు ఎన్ని వచ్చాయి..? ధరణి సమస్యల సమగ్ర వివచారలను సీసీఎల్‌సీసీఎల్ నవీన్‌మిట్టల్ కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. ధరణి సమస్యలు పరిష్కరించేందుకు చేపట్టాల్సిన మార్గాలపై ఆయన తగిన సూచనలు చేశారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులన్నింటిని వారం రోజుల్లోగా పూర్తి చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో భద్రాద్రి కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల మాట్లాడుతూ జిల్లాలో 3,851 ధరణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. పెండింగ్ దరఖాస్తుల్లో 80శాతం విచారణలు పూర్తి అయ్యాయని, మిగిలిన 20 శాతం రానున్న రెండు రోజుల్లో పూర్తి చేస్తామని తెలిపారు. వారం రోజుల్లోగా పూర్తిస్థాయిలో దరఖాస్తులను పరిష్కరిస్తామని ఆమె తెలిపారు.

ఖమ్మం కలెక్టర్ కలెక్టర్ వీపీ గౌతమ్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో అదనపు కలెక్టర్, ఆర్డీవోలు, తహసిల్దార్ల స్థాయిలలో పెండింగ్ ఉన్న ధరణి దరఖాస్తులను ప్రత్యేక కార్యాచరణ అమలు చేసి వచ్చే పక్షం రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. ప్రత్యేక డ్రైవ్ లో జిల్లాలో 3500 దరఖాస్తులు పరిష్కరించినట్లు, ఫిజికల్ గా 5 వేల దరఖాస్తులు పరిష్కరించినట్లు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికారులు నిమగ్నమైనందున పెండింగులో ఉన్నట్లు, వీటిపై దృష్టి సారించి పరిష్కరించనున్నట్లు కలెక్టర్ గౌతమ్ తెలిపారు.

జర్నలిస్టుల పోరాటాలకు దిశానిర్దేశం

- 19,20వ తేదీల్లో ఖమ్మంలో టీయూడబ్ల్యూజే-ఐజేయూ 3వ రాష్ట్ర మహాసభలు
- ఇళ్లస్థలాలు, హెల్త్‌కార్డులతో పాటు పలు సమస్యలపై చర్చ
- యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు శేఖర్, విరాహత్‌అలీ



మహాసభల లోగోను ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

ఖమ్మం కార్పొరేషన్, జూన్14: ఖమ్మంలో 18,19 తేదీల్లో నిర్వహించే టీయూడబ్ల్యూజే-ఐజేయూ 3వ రాష్ట్ర మహాసభలు జర్నలిస్టుల భవిష్యత్ పోరాటాలకు దిశానిర్దేశనం చేయబోతున్నాయని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నగలూరి శేఖర్, ప్రధాన కార్యదర్శి విరాహత్‌అలీ పేర్కొన్నారు. శుక్రవారం మహాసభల ఏర్పాట్లు పరిశీలించిన అనంతరం నగరంలోని జిల్లా పంచాయతీ వనరుల కేంద్ర భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఖమ్మం పోరాటాల పురిటిగడ్డ అని, ఏపీడబ్ల్యూజే ఉండగా రెండుసార్లు ఖమ్మంలో రాష్ట్రమహాసభలు జరిగాయని, తెలంగాణా ఏర్పడ్డాక మూడో రాష్ట్ర మహాసభలు ఖమ్మంలోనే నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రసభలకు వివిధ రాష్ట్రాలకు చెందిన 180మంది యూనియన్ ప్రతినిధులు హాజరవుతారన్నారు. జర్నలిస్టుల సమస్యలపై చర్చించనున్న ఈ మహాసభల్లో 12 తీర్మానాలు చేసి ఆమోదించనున్నట్లు పేర్కొన్నారు. ఖమ్మంలో రాష్ట్ర మహాసభలు నిర్వహించే ప్రాంగణానికి జర్నలిస్టుల సమస్యలకోసం పోరాటం చేసిన అమర్‌నాథ్ ప్రాంగణంగా నామకరణం చేశామన్నారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ఇళ్లస్థలాలు, హెల్త్‌కార్డులతో పాటు పలు సమస్యలను చర్చించి, ఈ.మహాసభల ద్వారా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు శేఖర్,విరాహత్‌అలీ తెలిపారు. ఈనెల 18న రాష్ట్ర ప్రతినిధులు ఖమ్మం చేరుకుంటారని, 19వ తేదీన టీయూడబ్ల్యూజే- ఐజేయూ మహాసభలను రాష్ట్ర రెవెన్యూ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభిస్తారన్నారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. మీడియా అకాడమీ ఛైర్మన్, ఐజేయూ జాతీయ అధ్యక్షుడు కె. శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శి బల్విందర్ సింగ్ జమ్ము, నాయకులు ఎస్ఎన్ సిన్హా, దేవులపల్లి అమర్‌తో పాటు పలువురు యూనియన్ నాయకులు పాల్గొంటారని తెలిపారు. ముగింపు రోజైన 20వ తేదీన రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హాజరవుతారని పేర్కొన్నారు. తానా మాజీ అధ్యక్షుడు జయశేఖర్ తాళ్లూరి, తాళ్లూరి పంచాక్షరయ్య చారిటబుల్‌ట్రస్టు మహాసభలకు హాజరయ్యే ప్రతినిధులకు బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం మహాసభల లోగోను ఆవిష్కరించారు. ఈ విలేకరుల సమావేశంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె. రాంనారాయణ, రాష్ట్ర నాయకుడు నలజాల వెంకట్రావు, జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు వనం వెంకటేశ్వర్లు, ఏనుగు వెంకటేశ్వరరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రవీంద్రశేషు, నగర అధ్యక్ష, కార్యదర్శులు మైసా పాపారావు, శ్రీనివాస్, నాయకులు సర్వనేని వెంకట్రావు, మొహియుద్దీన్ నామా పురుషోత్తం పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

(5వ పేజీ తరువాయి)

పెసర విత్తనాలు వ్యవసాయశాఖ నుంచి అందించాలని కోరారు. ఏన్కూరు ఎంపీపీ ఆరెం వరలక్ష్మీ మాట్లాడుతూ డీసీసీబీ, డీసీఎంఎస్‌లో ఇచ్చే ఎరువులు పక్కదోవ పట్టించి వ్యాపారులకే చేరుతున్నాయని ఆ తర్వాత రైతుల అవసరాల మేరకు వాటిని అధిక ధరలకు విక్రయిస్తున్నారని చెప్పడంతో జిల్లా వ్యవసాయశాఖ అధికారి విజయనిర్మల అలాంటిదేమీ లేదని సమాధానం చెప్పారు. దీనికి మంత్రి తుమ్మల మైకు అందుకుని మాట్లాడుతూ 'జేడీఏ గారూ... సభ్యులు చెప్పిన వాటిని నోట్ చేసుకోండి.... వారేమీ ఉత్తుతిగా అనే మాటలుకావు..' అని అనడంతో.. సరే పరిశీలిస్తాం సార్‌అని డీఏవో విజయనిర్మల సమాధానం చెప్పారు. ఆ తరువాత విద్యాశాఖ పనితీరుపై డీఈవో సోమశేఖరశర్మ నివేదికలు చదివి వినిపించారు. దీనిపై సభ్యులు ముక్త కంఠంతో నినదించారు. ప్రభుత్వ పాఠశాలకు ఉపాధ్యాయులు సకాలంలో హాజరుకావడం లేదని ఆరోపించారు. మీ పిల్లలనేమో ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించుకుంటూ బడిబాట కార్యక్రమం అంటే ఎలా అని ప్రశ్నించారు. విద్యాశాఖ, ఉపాధ్యాయుల పనితీరుపై సభలో నిరసన వ్యక్తమైంది. ఆ తర్వాత పాఠశాలల్లో మరమ్మతు పనులను సకాలంలో పూర్తి చేయాలని యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలను సకాలంలో అందించేలా చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మలను జడ్పీఛైర్మన్ లింగాల కమల్‌రాజ్ శాలువ, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో డీసీసీబీ ఛైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, జడ్పీ సీఈవో వినోద్, డిప్యూటీ సీఈవో నాగలక్ష్మి పాల్గొన్నారు.

ఘాటెక్కిన ఉల్లి.. కొండెక్కిన టమోటా..

ఖమ్మం మార్కెట్ జూన్ 14: నగరంలోని రైతుబజార్లు, బహిరంగ కూరగాయల మార్కెట్లలో టమోటా, ఉల్లి ధరలు కొండెక్కాయి. బహిరంగ మార్కెట్‌లో ప్రదేశాలను బట్టి కిలో టమోటా రూ.70-80లకు అమ్ముతుండగా, రైతుబజార్లలో మాత్రం రూ.60ల బోర్డు ధరలకు విక్రయిస్తున్నారు. మరోవైపు వారం రోజుల నుంచి ఉల్లిధరలు సైతం భారీగా పెరుగుతున్నాయి. రైతుబజార్లలో కిలో ఉల్లిగడ్డలను రూ.40 నుంచి రూ.45లకు విక్రయిస్తుండగా గల్లీ మార్కెట్లలో కిలో రూ.50 నుంచి రూ.60లు పలుకుతుంది. వారం క్రితం కిలో రూ.20- 25లకు లభించిన ఉల్లి ప్రస్తుతం 50శాతం ధరలు పెరిగి కిలో రూ.50లకు చేరడంతో సామాన్యులకు కొనకముందే కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. లోకల్‌గా వేసవి కాలం కావడంతోపాటు, కోతుల బెడద, వాణిజ్య పంటల సాగుపై మొగ్గు తదితర కారణాలతో రైతులు ఈ ఏడాది టమోటా పంటను చాలా తక్కువగా సాగు చేశారు. దీంతో పూర్తిగా ఇక్కడి వ్యాపారులు ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, ఏపీలోని మదనపల్లితోపాటు రాష్ట్రంలోని ఇతర దూర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తుండటంతో రవాణా చార్జీల భారంతో రేట్లు పెరుగుతున్నాయని వ్యాపారులు పేర్కొంటున్నారు. దేశంలో ఉల్లిని ఎక్కువగా పండించే మహారాష్ట్రలో గతేడాది వర్షాభావంతో 30శాతం దిగుబడి తగ్గి ఈ ఏడాది సరఫరా తగ్గిందని వ్యాపార నిపుణులు పేర్కొంటున్నారు. అంతేకాకుండా ఉల్లి రైతులు సాగు తక్కువగా చేయడంతో డిమాండ్‌కు సరిపడా సరఫరా లేక ధరలు పెరుగుతూ వినియోగదారులకు చుక్కలు చూపిస్తునాయి. ప్రస్తుతం ఖరీఫ్ వ్యవసాయ పనుల సీజన్ కావడంతోపాటు, పాఠశాలలు, హాస్టళ్ల పునఃప్రారంభం కావడంతో టమోటా, ఉల్లి వినియోగం ఎక్కువగా ఉంటుంది. కాగా బహిరంగ మార్కెట్‌లో ఉల్లి, టమోటా ధరలతో పాటుగా ఇతర కూరగాయల ధరలు సైతం రోజు రోజుకూ పెరుగుతున్నాయి.

జాతీయ రగ్బీ పోటీలకు అభినమ

ముదిగొండ, జూన్ 14: జాతీయస్థాయి రగ్బీ పోటీలకు మండలంలోని న్యూలక్ష్మీపురం కస్తూర్బా గాంధీ పాఠశాల విద్యార్థిని అభినమ ఎంపికైన ఎస్‌వో ఇందిర తెలిపారు. 11,12తేదీల్లో హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి మీట్‌లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని చల్లగొండ అభినమ పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనపర్చి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. ఈనెల 19, 20తేదీల్లో మహారాష్ట్రలోని పూణె బల్లెవాడిలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననుందని పేర్కొన్నారు.

ఖమ్మం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో అక్రమ నిర్మాణాల విషయంలో కార్పొరేషన్ అధికారుల తీరు ఒక్కో సంఘటనలో ఒక్కో రకంగా ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆయా నిర్మాణాలపై ఫిర్యాదులు వచ్చిన సందర్భంలో మాత్రం చట్టాన్ని పలు రకాలుగా ఉపయోగిస్తున్నారన్న విమర్శలు లేకపోలేదు. పలు నిర్మాణాలపై ఫిర్యాదులు వచ్చినప్పుడు అక్కడ అంతా సక్రమంగానే ఉందంటూ ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టించి పబ్బం గడుపుకొంటున్నారన్న విమర్శలు లేకపోలేదు. మరికొన్ని సందర్భాల్లో ఫిర్యాదులు వచ్చినప్పుడు ఏళ్లతరబడి నివాసం ఉండేవారికి సైతం నోటీసులు జారీ చేయడం వెనుక ఉన్న అంతర్యమేంటనేది తెలియాల్సి ఉంది. కాగా ప్రస్తుతం ఆయా ఫిర్యాదుల విషయంలో అధికారుల వ్యవహారశైలిని మాత్రమే ప్రజలు ప్రశ్నిస్తుండగా.. చట్టాన్ని అందరికీ ఒకేలా ఎందుకు వర్తింపజేయడంలేదనే విషయంపై అనుమానాలు రేకెత్తుతున్నాయి. కొందరు అధికారులు అయితే ఏకంగా ప్రస్తుతం అమల్లో ఉన్న మాస్టర్‌ప్లాన్ మార్చి మరీ అనుమతులు ఇచ్చారన్న ఆరోపణలు లేకపోలేదు.

ఇంటిదొంగలపై అంత ఇష్టమెంటో?

దొంగ అసెస్‌మెంట్లు.. కార్పొరేషన్ కార్యాలయంలో కొందరు అధికారులు చేసిన వికృత చర్య. ప్రభుత్వ, ఎన్నెస్పీ, రోడ్లు ఇలా ఒకటేంటి.. వందల కొద్దీ దొంగ అసెస్‌మెంట్లకు పాల్పడిన వ్యవహారం కార్పొరేషన్ పరిధిలో పెద్ద కలకలమే రేపింది. ఆ వ్యవహారం అంత పెద్ద మొత్తంలో లేదని కప్పిపుచ్చుకునేందుకు పదుల సంఖ్యలోనే దొంగ అసెస్‌మెంట్లు ఉన్నాయనీ చెప్పిన అధికారులు అనధికారికంగా వందల సంఖ్యలో అసెస్‌మెంట్లను డీయాక్టివేట్ చేసినట్టు సమాచారం. అంతేకాదు నేటివరకు ఆయా అధికారులపై ఎలాంటి చర్యలకు ఉపక్రమించకపోవడం గమనార్హం. దాంతో అధికారులు చేసిన అక్రమాలకు ఉన్నతాధికారులే వత్తాసు పలుకుతున్నారన్న ప్రచారం జరుగుతోంది.

వాస్తవానికి ఇంటి పన్నులకు సంబంధించిన అసెస్‌మెంట్లలో చిన్నపాటి అక్రమానికి పాల్పడితేనే మిగతా మునిసిపాలిటీల్లో ఏకంగా సస్పెన్షన్ చేస్తున్న అధికారులు



సర్వే నెంబర్లలో మార్పులు జరుగుతుంటాయట...

ఖమ్మం రెవెన్యూ పరిధిలోని శ్రీనివాసనగర్ ప్రాంతంలో ఉన్న సర్వే నెంబరు 344కు సంబంధించి ప్రభుత్వ భూమి ఉందని, కొందరు కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నారంటూ వివాదం నెలకొంది. దీనిపై కలెక్టర్ వీపీ గౌతమ్ స్పందించి సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. రెవెన్యూ అధికారులు విచారణ నిర్వహించి సదరు సర్వే నెంబరులో ప్రభుత్వ భూమి లేదని తేల్చారు. అంతవరకు బాగానే ఉన్నప్పటికీ ఆ తర్వాత కొద్దిరోజులకు కార్పొరేషన్ అధికారులకు మరో ఫిర్యాదు అందింది. సర్వే నెంబరు 339, 340 డాక్యుమెంట్ల పేరుతో అపార్ట్‌మెంట్ నిర్మాణానికి అనుమతులు తీసుకుని 344 సర్వే నెంబరులో అక్రమంగా నిర్మాణం చేస్తున్నారని కొందరు ఫిర్యాదు చేశారు. దీనిపై సంబంధిత అధికారిని సంప్రదించగా.. కొన్నిసార్లు భూములకు సంబంధించి సర్వే నెంబర్లలో మార్పులు జరుగుతుంటాయని సెలవిచ్చారు. భూమికి సంబంధించి అసలు యజమానులు వచ్చి ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని చెప్పడం కొసమెరుపు.

అయినవారికి అందలం.. కానివారికి కట్టుబిట్టం...

ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్‌లో అధికారుల రూటే సప'రేటు'

ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో ఎకరాల్లో ఉన్న స్థలాలతోపాటు అసైన్డ్ భూముల్లో పేర్లు మార్చుకునేందుకు, ప్రభుత్వ భూములకు దొంగ అసెస్‌మెంట్లు వేసి వారికి ఆయా భూములకు హక్కులు కల్పించే ప్రయత్నం చేసినప్పటకీ ఉన్నతాధికారులు మాత్రం వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పైగా దొంగ అసెస్‌మెంట్ల వ్యవహారంలో ప్రభుత్వ స్థలానికి అసెస్‌మెంట్లు వేయించుకున్న ఏడుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. కానీ నేటివరకు ఆ కేసు దర్యాప్తు జరగకపోవడం గమనార్హం. ప్రైవేటు స్థలాల వివాదాల్లో దొంగ డాక్యుమెంట్లు సృష్టించిన వారిపై కేసు నమోదు చేయడంతోపాటు, అందుకు సహకరించిన అధికారులపై కూడా ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు.. ఏకంగా ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసే ప్రయత్నం చేసిన అక్రమార్కులకు వంత పాడిన అధికారులను, దానికి సంబంధించిన కేసును ఎందుకు పట్టించుకోవడం లేదనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

డీయాక్టివేట్ చేసి చేతులు దులుపుకొన్నారు..

ఖమ్మం అర్బన్ పరిధిలోని బల్లెపల్లి రెవెన్యూలో 137,138 సర్వే నెంబర్లలోని అసైన్డ్ భూములు ఉండగా.. కొందరు వ్యక్తులు ఆయా భూముల్లో తమ పేరుమీద లేని భూముల్లో ఏకంగా ఇళ్లే నిర్మించుకోవడంతోపాటు, ఆయా ఇళ్లకు అసెస్‌మెంట్లు కూడా వేయించుకున్నారు. దీనిపై రెవెన్యూశాఖ అధికారులు పీవోటీ నోటీసులు జారీ చేయగా.. కార్పొరేషన్ అధికారులు మాత్రం అసెస్‌మెంట్లు డీయాక్టివేట్ చేసి చేతులు దులుపుకొన్నారు. ఈ వ్యవహారంలో పెద్ద ఎత్తున నిర్మాణాలను పూర్తిచేసేవరకు అధికారులు చర్యలు చేపట్టకపోవడం వెనుక ముడుపులు ముట్టాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేనా ఆయా అసెస్‌మెంట్లు వేసిన అధికారులెవరనే దానిపై విచారణ కరువే.

అసెస్‌మెంట్ల అక్రమార్కులపై చర్యలేవీ?

వైరా మునిసిపాలిటీ పరిధిలోని ఇంటి పన్నులను రివిజన్ పేరుతో తగ్గించారంటూ ఓ సీనియర్ అసిస్టెంట్‌పై మరుసటిరోజే సస్పెన్షన్ వేటు వేశారు. కానీ ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో ఏకంగా ప్రభుత్వ స్థలాలు ఆక్రమించుకునేందుకు వత్తాసు పలికేలా వ్యవహరించిన అధికారులపై చర్యలు లేవు. కార్పొరేషన్ పరిధిలో కొందరు ఇంటిదొంగలు స్థలాలకు సంబంధించిన డాక్యుమెంట్లు, ఇంటి నిర్మాణాలు లేనప్పటికీ ఉన్నట్టుగా చూపిస్తూ పెద్దఎత్తున అసెస్‌మెంట్లు వేసి అక్రమాలకు పాల్పడ్డారు. అలాంటి అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోకపోవడం వెనుక అంతర్యమేంటన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

పాత మాస్టర్‌ప్లాన్.. కొత్త కథ...

ఖమ్మం మమతారోడ్డులో మాస్టర్‌ప్లాన్‌కు భిన్నంగా ఓ అపార్ట్‌మెంట్‌కు కొందరు అధికారులు ఏకంగా లొకేషన్ మార్చి ఉన్నతాధికారులను ఏమార్చి అనుమతులు మంజూరు చేశారన్న ఆరోపణలున్నాయి. కాగా దీనిపై ఉన్నతాధికారులు ఇప్పటికే విచారణకు ఆదేశించినట్టు సమాచారం. అయితే అలా అనుమతులు మంజూరు చేసిన సంబంధిత అధికారి మాత్రం పాత మాస్టర్ ప్లాన్ తప్పుల తడకగా ఉందని, రాబోయే రోజుల్లో కొత్త మాస్టర్ ప్లాన్ వచ్చినప్పుడు అది సక్రమం అవుతుందని చెప్పడం గమనార్హం. అలా అయితే ప్రస్తుత మాస్టర్ ప్లాన్ ప్రకారం అనుమతులు ఇవ్వడం కుదరదని సామాన్యుల దరఖాస్తులను ఎందుకు తిరస్కరిస్తున్నారో సదరు అధికారికే తెలియాలి.

'కూలి'పోయిన బతుకులు

అశ్వారావుపేట రూరల్, జూన్ 14: మామిడి మొక్కలు, కూలీలతో వెళుతున్న ట్రాక్టర్‌ను లారీ ఢీకొనగా ఇద్దరు కూలీలు మృతచెందగా మరో 14మందికి గాయాలు అయ్యాయి. మృతులు, క్షతగాత్రులందరిదీ ఒకే ఊరు కావటంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలోని గుమ్మడివల్లి గ్రామానికి చెందిన పలువురు అశ్వారావుపేటలోని నర్సరీల్లో పని నిమిత్తం వెళుతుంటారు. ఉదయం వచ్చి పనులు ముగించుకుని ఇంటికి వెళుతుంటారు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం అశ్వారావుపేటలోని ఓ నర్సరీ నుంచి నారంవారిగూడెంలోని మరో నర్సరీకి కూలీలుమామిడి మొక్కలను ట్రాక్టర్‌లో తీసుకెళుతున్నారు. ఇదే సమయంలో మండలంలోని నారంవారిగూడెం కాలనీ సమీపంలో ఖమ్మం వైపు వెళుతున్న లారీ వేగంగా దూసుకువచ్చి కూలీలతో వెళుతున్న ట్రాక్టర్ ఢీకొంది. ట్రాక్టర్ బోల్తాపడి కూలీలు రోడ్డు ప్రక్కన చెల్లాచెదురుగా పడిపోయారు.

ప్రమాదంలో వంటెపులి వెంకటలక్ష్మి(35) లారీ కింద పడి అక్కడిక్కడే మృతిచెందింది. తీవ్రంగా గాయపడిన బత్తుల దుర్గయ్యను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. డేరంగుల అనిల్, వి.కోటమ్మ, నాగమణి, కోటమ్మ, ముసలయ్య, దుర్గమ్మ, డేరంగుల స్వామి, అలివేలు, సామ్రాజ్యం, నీరజ, నాగమల్లేశ్వరి, వెంకమ్మ, దుర్గయ్య, కృష్ణమ్మ అనే వ్యక్తులకు పలుచోట్ల తీవ్రంగా గాయాలు అయ్యాయి. డేరంగుల అనిల్, స్వాతిలను కొత్తగూడెం తరలించారు. నీరజ, ముసలయ్య, వెంకమ్మ, మల్లేశ్వరితో పాటు మొత్తం ఆరుగురిని సత్తుపల్లికి తరలించారు. ప్రమాద విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అశ్వారావుపేట ఆసుపత్రికి వచ్చి క్షతగాత్రులను పరామర్శించారు. వివరాలు తెలుసుకుని మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఘటనపై పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'సీతారామ' దశ మారేనా...!?

(5వ పేజీ తరువాయి)

నీటి సరఫరా అయ్యేలా కాలవలు నిర్మించారు. దీనికి అనుసంధానంగా దుమ్ముగూడెం వద్ద 36 టీఎంసీల నీరు నిలవ ఉంచేలా సీతమ్మ సాగర్‌ను కూడా ప్రభుత్వం నిర్మించింది. సుమారు రూ.3121 కోట్లతో తలపెట్టిన సీతమ్మసాగర్‌కు రూ.1500 కోట్లతో 67శాతం పనులు పూర్తయ్యాయి. దుమ్ముగూడెం వద్ద 1320 మీటర్ల పొడవు 25 మీటర్ల ఎత్తున 36టీఎంసీల నీరు నిలవ ఉండేలా నిర్మిస్తున్న సీతమ్మసాగర్ వద్ద 280 మెగా వాట్ల హైడల్ విద్యుత్ ఉత్పత్తికి సంబంధించిన పనులకు టెండర్లు పిలవాల్సి ఉంది. కాగా పాలేరుకు అనుసంధానం చేసే లింక్ కెనాల్ తో పాటు జూలూరుపాడు వద్ద రూ.180కోట్లతో 2కి.మీ. టన్నెల్, డోర్నకల్ వద్ద రూ.300కోట్లతో 8కి.మీ. టన్నెల్ నిర్మించాల్సి ఉంది. అయితే ప్రస్తుతం ఏన్కూరు నుంచి వైరా వరకు 8కి.మీ. పాటు సీతారామ ఏన్కూరు లిక్‌కెనాల్ పనులు నిర్వహిస్తున్నారు. ఆగస్టు 15నాటికి పూర్తిచేసి నీరు వదలాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఆగస్టు 15 నాటికి అయ్యేనా...

వచ్చే ఆగస్టు 15 నాటికి పాలేరుకు లింక్ కెనాల్ ద్వారా సీతారామ ప్రాజెక్టు నుంచి నీరు వదులుతామని మంత్రులు హామి ఇచ్చినా పనులు పూర్తవుతాయా లేదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రధాన కాలవల పూడికలు, అశ్వాపురం, బూర్గంపాడు మండలాల్లో గండ్లుకూడా పడ్డాయి. వాటి గండ్లు పూడ్చాల్సిన అవసరం ఉంది. అలాగే ఏన్కూరు లింక్ కెనాల్ పనులు కూడా పూర్తిచేయాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో భారీ వర్షాలు పడితే పనులకు తీవ్ర ఆటంకం కలిగే పరిస్థితి ఉంది. ఈ ఆటంకాలను అధిగమించి పనులు చేయాలంటే నీటిపారుదల అధికారులకు పెద్దపరీక్షే.

దీనికితోడు మొత్తం ప్రాజెక్టు నిర్మాణ పనుల్లో ఇటు ఖమ్మం ఆటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల ఇరిగేషన్ అధికారుల మధ్య సమన్వయం కనబడడంలేదు. ఎవరి జిల్లా వారిదే అన్నట్టుగా ఎవరి పనులు వారు చేస్తున్నారు తప్ప సమష్టిగా, సమన్వయంగా ముందుకు పోవడంలేదు. మొత్తం ప్రాజెక్టు లక్ష్యం పూర్తికావాలంటే మరో రెండేళ్ల కాలం పట్టే అవకాశం కనిపిస్తున్నది. మొత్తం ప్రాజెక్టు పూర్తికావాలంటే మరో రూ.8వేల కోట్ల వరకు అవసరం ఉంది. కనీసం ఏన్కూరు లింక్ కెనాల్ పూర్తయితే సుమారు లక్షా50వేల ఎకరాల సాగర్ ఆయకట్టుకు వైరా, లంకసాగర్, బేతుపల్లికి గోదావరి జలాలు అందే అవకాశం ఉంటుంది.

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమీక్షలో జూలూరుపాడు టన్నెల్‌కు రూ.180కోట్లు, డోర్నకల్ టన్నెల్‌కు రూ.300కోట్లు మంజూరు చేస్తామని హామి ఇచ్చారు. సుమారు రూ.480కోట్లు వస్తే ఈ టన్నెల్ పనులు మొదలయ్యే అవకాశం ఉంది. మరోవైపు రూ.2500కోట్లతో పాలేరు లింక్‌కెనాల్‌కు టెండర్లు జరిగాయి. ఈపనులు కూడా వేగవంతంగా చేపట్టాలంటే నీటిపారుదల శాఖ అధికారులుచురుగ్గా పనిచేయాల్సిన అవసరం ఉంది.ఈప్రాజెక్టులపైనా మంత్రులు కూడా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేసి ఇంకా భూసేకరణ, అటవీ క్లియరెన్స్, నిర్వాసితులకు పరిహారం వంటి సమస్యలు కూడా అనేకం ఉన్నాయి. వీటిని కూడా అధిగమించాల్సిన అవసరం ఉంది.

భద్రాద్రిలో దంచికొట్టిన వర్షం



నీట మునిగిన దుకాణాలు

భద్రాచలం, జూన్ 14: భద్రాచలంలో శుక్రవారం గంటపాటు కురిసిన భారీ వర్షంతో జనజీవనం స్తంభించింది. భారీగా ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులు, పిడుగులు రావడంతో ఆ సమయంలో బయటకు వచ్చేందుకు ఎవరు సాహించలేదు. ఈ సీజన్‌లో భద్రాద్రిలో ఇదే అతిపెద్ద వర్షంగా పేర్కొనవచ్చు. దీంతో పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో చెట్లు, విద్యుత్తు స్తంభాలు నేలకొరిగాయి. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా విద్యుత్తు సరఫరాను ట్రాన్స్‌కో అధికారులు నిలిపివేశారు. కాగా విస్తా కాంప్లెక్సు సమీపంలో ఒక పెద్ద గోడ నేలకొరగడంతో వర్షపు నీరు స్లూయిస్‌ల ద్వారా గోదావరిలో కలిసేందుకు ఆటంకం ఏర్పడటంతో రామాలయ పరిసరాల్లో నీరు అధికంగా చేరింది. కాగా 5.8 సెం.మీ. వర్షపాతం నమోదైంది.

నీట మునిగిన నిత్యన్నదాన సత్రం

ఈ భారీ వర్షంతో రామాలయం పడమర మెట్ల వైపు ఉన్న పరిసరాలు నీట మునిగాయి. చప్టా దిగువలోని చిరు వ్యాపారుల దుకాణాలు, భద్రాద్రి దేవస్థానం నిత్యన్నదాన సత్రంలోకి భారీగా వర్షపు, మురుగు నీరు చేరింది. దీంతో దేవస్థానం సిబ్బంది అప్పటికప్పుడు వంట సామాన్లను, బియ్యం, ఇతరత్రా సామాన్లను సురక్షిత ప్రాంతంలో ఉన్న మరో గదిలోకి తరలించారు. ఇదిలా ఉండగా ఈ విషయం తెలిసిన వెంటనే భద్రాచలం దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, ఏఈవో భవానీరామకృష్ణారావు, ఈఈ వి.రవీంద్రనాథ్ తదితరులు అక్కడికి చేరుకొని సిబ్బందికి సూచనలు చేశారు. వర్షం తగ్గిన తరువాత దేవస్థానం సిబ్బంది నిత్యన్నదాన సత్రంలో నీరు బయటకు వెళ్లిన అనంతరం ఆ ప్రాంగణాన్ని శుభ్రం చేసే పనిలో నిమగ్నమయ్యారు. కాగా అన్నదానం సత్రంలో పారిశుధ్య చర్యలు ముగిసే వరకు అన్నప్రసాదం ప్యాకెట్ల రూపంలో భక్తులకు అందజేయనున్నట్టు తెలిపారు.

ప్రాజెక్టులకు భూసేకరణ వేగిరం చేయాలి

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 14: జిల్లాలో చేపడుతున్న వివిధ ప్రాజెక్టులకు భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలో చేపట్టిన రైల్వే, జాతీయ రహదారులు, నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణ పురోగతిపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రాజెక్టులకు సంబంధించి, వాస్తవ అవసరం మేరకు భూసేకరణ చేపట్టాలన్నారు. మూడో రైల్వే లైన్‌కు సంబంధించి, జిల్లాలో 59.17 హెక్టార్ల భూసేకరణ చేయాల్సి వుండగా, 54.28 హెక్టార్లకు అవార్డ్ పాస్ చేసి, భూమిని స్వాధీనం చేసుకొని, రైల్వేకు అప్పగించినట్లు తెలిపారు. మిగులు 4.11 హెక్టార్లకు చర్యలు తీసుకుని మూడో లైన్ పనులు వేగవంతం అయ్యేలా చూడాలన్నారు. డోర్నకల్, భద్రాచలంరోడ్ జంక్షన్ల మధ్య రైల్వే డబ్లింగ్ లైన్ ప్రాజెక్టుకు సంబంధించి సింగరేణి మండలం కమలాపురం, పోచారం, సింగరేణి, కారేపల్లి, కోమట్లగూడెం, రేలకాయలపల్లి గ్రామాల్లో 57.045 ఎకరాల భూసేకరణకుగాను జేఎంఎస్ సర్వే ప్రక్రియ చేపట్టి, పీఎన్ పబ్లిష్ చేయాలన్నారు. రఘునాథపాలెం మండలం పాపటపల్లి, చింతకాని మండలం బస్వాపురం, నాగులవంచ, పాతర్లపాడు, ఎర్రుపాలెం మండలం ఎర్రుపాలెం వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణాలకు భూసేకరణ ప్రక్రియ పూర్తి చేసి, రైల్వే శాఖకు అప్పగించాలన్నారు.

ఖమ్మం- దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే ప్యాకేజీ-1 కోసం జిల్లాలో 548.08 ఎకరాల భూసేకరణకుగాను, 507.2925 ఎకరాలకు అవార్డ్ పాస్ కాగా, రూ.144.84 కోట్లు భూమి కోల్పోయిన రైతుల ఖాతాలకు జమచేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. ఇంకా 40.1875 ఎకరాలకు సంబంధించి భూసేకరణ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఇదే ప్రాజెక్ట్ ప్యాకేజీ-2 క్రింద 424.19 ఎకరాల భూసేకరణ అవసరం కాగా, 407.0450 ఎకరాలకు అవార్డ్ పాస్ చేసి, ఇప్పటివరకు రూ.98.34 కోట్లు పరిహారం చెల్లించినటు తెలిపారు. ఇంకా 17.1450 ఎకరాల భూసేకరణ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఖమ్మం- దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే ప్యాకేజీ-3 కింద 383.3325 ఎకరాల భూసేకరణకు గాను 371.1200 ఎకరాలకు అవార్డ్ పాస్ చేసి, రైతుల ఖాతాల్లో రూ. 88.94 కోట్ల పరిహారం జమ చేశామన్నారు. మిగులు 12.2125 ఎకరాల భూమి సేకరించాల్సి ఉందన్నారు.

సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ (పాలేరు లింక్ కెనాల్) కింద ఏన్కూరు, కామేపల్లి, సింగరేణి, తిరుమలాయపాలెం, కూసుమంచి మండలాల్లో 1717.34 ఎకరాల భూసేకరణకుగాను, 1569.39 ఎకరాలకు అవార్డ్ పాస్ చేసి, ఇప్పటివరకు భూ పరిహారం క్రింద రూ.93.39 కోట్లు, నిర్మాణాల పరిహారం కింద రూ.7.30 కోట్లు విడుదల అయినట్టు ఆయన తెలిపారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ (సత్తుపల్లి ట్రంక్ కెనాల్) కింద 330.15 ఎకరాల భూసేకరణకుగాను 325.30 ఎకరాలకు అవార్డ్ పాస్ చేసి, రూ.19.59 కోట్లు పరిహారం కింద ఇప్పటికి విడుదల చేసినట్లు ఆయన అన్నారు. ఏన్కూరు వద్ద 18 ఎల్ కెనాల్, బుగ్గవాగు ప్రాజెక్టుల భూసేకరణ వేగవంతం చేయాలన్నారు.

మున్నేరు రిటైనింగ్ వాల్ కొరకు 190.16 ఎకరాల భూసేకరణ ప్రక్రియ క్షేత్రస్థాయి తనిఖీలు చేసి పూర్తి చేయాలన్నారు. జిల్లాలో ఆయిల్ పామ్ ఇండస్ట్రీ, రోడ్ల విస్తరణ, ఆర్‌యూబీ, గోడౌన్ల నిర్మాణం, సింగరేణి కాలరీస్ కంపెనీకి సంబంధించి జేవీఆర్ ఓసీపీ, కిష్టారం ఓసీపీ ప్రాజెక్టులకు కావాల్సిన భూసేకరణ పనుల్లో వేగం పెంచాలని, జాయింట్ సర్వే చేసి ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రాజెక్టుల పూర్తితో రవాణా, సాగునీటి వ్యవస్థ బలపడి, జిల్లా అభివృద్ధి పథంలో పయనించే ఆస్కారం ఉంటుందన్నారు. జిల్లా అభివృద్ధికి సహకరించాలని కలెక్టర్ గౌతమ్ అన్నారు.

ఈ సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, ఆర్డీవోలు జి.గణేష్, ఎల్.రాజేందర్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాసులు, మైనింగ్ ఏడీ సాయినాథ్, జాతీయ రహదారుల, రోడ్లు, భవనాల, ఇరిగేషన్, మునిసిపల్, రైల్వే శాఖల అధికారులు, జిల్లాలోని తహసీల్దార్లు పాల్గొన్నారు.

నేడు హైదరాబాద్‌లో న్యాయవాదులకు నైపుణ్య తరగతులు

ఖమ్మం లీగల్ జూన్ 14: ఐలు రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా ఐలు కమిటీ రాష్ట్రస్థాయిలో న్యాయవాదులకు వృత్తినైపుణ్య తరగతులు ఈ రోజు రంగారెడ్డి జిల్లాకోర్టు ఆవరణలో ఏర్పాటుచేశారు. ఈ తరగతులకు రాష్ట్ర వ్యాప్తంగా న్యాయవాదులు తమపేర్లు నమోదుచేసుకున్నారు. ఈ తరగతులలో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కొత్త చట్టాలపై ప్రత్యేక తరగతులు ఐలు ఏర్పాటుచేసింది. ఈ కార్యక్రమాన్ని బార్ కౌన్సిల్ సభ్యుడు కొల్లి సత్యనారాయణ పర్యవేక్షిస్తున్నారు. ఈ తరగతులకు ఖమ్మం జిల్లా న్యాయవాదుల వెంట ఐలు కేంద్ర కమిటీ కార్యదర్శి మందడపు శ్రీనివాసరావు, మీసాల వెంకటేశ్వర్లు, ఖమ్మం జిల్లా కమిటీ అధ్యక్షుడు నల్లమల నవీన్‌చైతన్య, కార్యదర్శి చింతనిప్పు వెంకట్, జిల్లా నాయకులు జక్కంపూడి నాగేశ్వరరావు, తన్నీరు పాపయ్య, రామలక్ష్మి, శ్రీలక్ష్మి హాజరుకానున్నారు.

ఐసెట్‌లో చిరుమర్రి విద్యార్థినికి పదో ర్యాంకు


రవళి

ముదిగొండ, జూన్ 14: ముదిగొండ మండలం చిరుమ ర్రి గ్రామానికి చెందిన బూదారపు రవళి శుక్రవారం విడు దలైన టీజీ ఐసెట్‌లో రాష్ట్రస్థాయిలో పదోర్యాంకు సా ధిం చింది. ప్రస్తుతం రవళి బీటెక్ పూర్తి చేసి మహ బూ బ్‌నగర్ ఎస్‌బీఐ జూనియర్ అసోసియేట్‌గా పనిచేస్తుంది. ఒకవైపు ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే మరోవైపు ఐసెట్‌కు ప్రిపేయిర్ అయింది. రవళిని పలువురు అభినందించారు.

ఆధునిక భారతావని మార్క్సిజంతోనే సాధ్యం

» సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని

పాల్వంచ టౌన్, జూలై 14: ఆధునిక భారతావని మార్క్సిజంతోనే సాధ్యమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. గురువారం దమ్మపేట సెంటరులో రెండురోజులపాటు జరగనున్న సీపీఐ జిల్లా స్థాయి శిక్షణ తరగతులను అరుణపతాకాన్ని ఆవిష్కరించి ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ సామాజిక ఆర్థిక అసమానతలను రూపు మాపి సమసమాజ స్థాపనకుబాటలు వేయగలిగింది. కమ్యూనిస్టులేనని, ఆ బాధ్యత కమ్యూనిస్టులమైన మనపై ఉందని తెలిపారు. మతోన్మాదపు విష భావజాలం నుంచి దేశాన్ని కాపాడుకుంటు సమసమాజ స్థాపనే లక్ష్యంగా ముందుకు సాగాలని అన్నారు. మరో అతిథి ప్రొఫెసర్ ఖాసీం మాట్లాడుతూ సామాజిక విష భావజాలం నుంచి దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు. అనంతరం సీపీఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు, నూతన సవాళ్లు, పార్టీ నిర్మాణం తదితర అంశాలపై నాయకులకు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఎండి. యూసుఫ్, ప్రొఫెసర్ యుగల్ రాయల్ శిక్షణ తరగతుల ప్రిన్సిపాల్ నరాటి ప్రసాద్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా, రాష్ట్ర కార్యవర్గసభ్యులు అయోధ్య, మున్నా లక్ష్మీకుమారి, బ్రహ్మం, పుల్లారెడ్డి, సలీం, సీహెచ్. శ్రీనివాసరావు, పట్టణ, మండల కార్యదర్శులు అడుసుమల్లి సాయిబాబు, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, రాహుల్, ప్రజాసంఘాల బాధ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని

ఆయిల్‌పాం సలహా కమిటీ సభ్యుల నియామకం

» వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, ఆలపాటి రామచంద్రప్రసాద్‌ను నియమిస్తు ప్రభుత్వ ఉత్తర్వులు


ఎమ్మెల్యేకు పుష్పగుచ్చం అందజేస్తున్న దృశ్యం, రామచంద్రప్రసాద్

వైరా/దమ్మపేట, జూన్ 14: రాష్ట్ర ప్రభుత్వ ఆయిల్‌పాం సలహా కమిటీ సభ్యుడిగా వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ నియమితులయ్యారు. తెలంగాణ ప్రభుత్వం 22మందితో కూడిన రాష్ట్రస్థాయి ఆయిల్ పామ్ సలహా కమిటీని ఏర్పాటుచేస్తూ ఉత్తర్వులు 353 జీవోను జారీ చేసింది. ఈ కమిటీలో ఖమ్మంజిల్లా నుంచి వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌ను సభ్యుడిగా నియమించింది. జిల్లాలో ఆయిల్‌పాం అభివృద్ధి కోసం సహాయస హకారాలు అందిస్తానని, ఆయిల్‌పాం అధిక విస్తీర్ణంలో సాగులోకి తీసుకురావడానికి తనవంతు కృషిచేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఆయిల్‌పాం రైతుల సమస్యలను ఆయిల్‌పాం ఫ్యాక్టరీ యాజమాన్యాలు, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వైరా ఉద్యానవనశాఖ అధికారి ఆకుల వేణు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు.

అడ్వైజరీ కమిటి సభ్యుడిగా ఆలపాటి

దమ్మపేట: తెలంగాణా ఆయిల్‌పాం అడ్వైజరీ కమిటి సభ్యుడిగా అల్లిగ్రామానికి చెందిన ఆలపాటి రాంచంద్ర ప్రసాద్‌ను నియమిస్తూ ఉద్యానవనశాఖా డైరెక్టర్ అశోక్‌రెడ్డి ద్వారా ఉత్తర్వులు శుక్రవారం అందాయి. దమ్మపేట మండలం అల్లిపల్లి గ్రామానికి చెందిన ఆలపాటి రామచంద్రప్రసాద్ ప్రస్తుతం తెలంగాణా ఆయిల్‌పాం ఫార్మర్ వెల్ఫేర్ సొసైటి అధ్యక్షులు కొనసాగుతున్నారు. ఆలపాటి రాంచంద్రప్రసాద్ మాట్లాడుతు పామాయిల్ రైతుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

తుమ్మలకు అభినందనలు :

ఆయిల్‌పాం అడ్వైజరీ కమిటి సభ్యుడిగా అల్లిపల్లి గ్రామానికి చెందిన ఆలపాటి రాంచంద్రప్రసాదు నియమించటంపట్ల సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయశాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు అభిందనలు తెలిపారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో దమ్మపేట సొసైటి ఛైర్మన్ ఎల్లిన రాఘవరావు, ఎంపీపి సోయం ప్రసాదు, పామాయిల్ సంఘం డైరెక్టర్ కొయ్యల అచ్యుతరావు, మాజీ ఆత్మాకమిటి ఛైర్మన్ కేవి సత్యనారాయణ, ఎల్లిన మురళి, కక్కిరాల రమేష్, దొడ్డా ప్రసాదు, కాసాని నాగప్రసాదు, ఎర్రా వసంతరావు, ఎర్లగోర్ల రాదాకృష్ణ, పోతినేని శ్రీరామ వెంకట్రావు, గూడపాటి వెంకట్రావు, గుత్తా రాజా, మన్నెం అప్పారావు, తదితరులున్నారు.

గిరిజన విద్యార్థులకు సివిల్స్‌కు ఉచిత శిక్షణ

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 13: రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే సివిల్ సర్వీసెస్ పరీక్షలు-25 రాష్ట్ర ఎస్టీ, ఎస్సీ, బీసీ అభ్యర్థులకు హైదరాబాద్‌లోని హైదరాబాద్ రాజేంద్ర నగర్ లో ఉన్న గిరిజన ఐఏఎస్ స్టడీ సర్కిల్ ద్వారా రెసిడెన్సియల్ పద్ధతిలో ఇంటిగ్రేటెడ్ గైడెన్స్ శిక్షణ ఇచ్చేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోన్నట్లు ఆ శాఖ డీడీ విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణకు చెందిన ఎస్టీ, ఎస్సీ, బీసీ అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఆమె కోరారు. అభ్యర్థులను ఆబ్జెక్టివ్ టైపు, ఆప్టిట్యూడ్ పరీక్ష ద్వారా ఎంపిక చేస్తామన్నారు. అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.3.00 లక్షలు మించవద్దని, అభ్యర్థులు హెచ్‌టీటీపీ://స్టడీసర్కిల్.సీజీజీ.జీవోవీ.ఇన్‌లో లాగిన్ అయి శుక్రవారం నుంచి ఈ నెల 30 వరకు ఆన్‌లైన్ ద్వారా మాత్రమే రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ 6281766534 నంబరులో ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5.00 లోపు సంప్రదించాలని ఆమె కోరారు.

భారీ వర్షంతో ట్రాన్స్‌కోకు రూ.10లక్షల నష్టం

» మధిరలో నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు, పాడైన ట్రాన్స్‌ఫార్మర్లు
» పరిశీలించిన చీఫ్ జనరల్ మేనేజర్

మధిర, జూన్ 14: మధిరలో గురువారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి విద్యుత్ శాఖకు రూ.10లక్షల నష్టం జరిగింది. గురువారం రాత్రంతా వన్‌టౌన్ ప్రాంతంలో అంధకారం అలుముకుంది. శుక్రవారం సాయంత్రానికి కూడా పూర్తిస్థాయిలో విద్యుత్ పునరుద్ధరణ జరగలేదు. ఒక్క మధిరలోనే 20 కరెంట్ స్తంభాలు పడిపోగా, ఎర్రుపాలెం మండలంలో 10 కరెంట్ పోల్స్ పడిపోయాయి. కరెంట్ వైర్లు ఎక్కడికక్కడే తెగిపడిపోయాయి. ఇంకా రూరల్ మండలం సమాచారం రావాల్సి ఉంది. వర్షం కారణంగా గురువారం నిలిచిపోయిన కరెంట్ పునరుద్ధరించేందుకు ఏడీఈ అనురాధ ఆధ్వర్యంలో టౌన్ ఏఈ అనిల్‌కుమార్, సిబ్బంది రాత్రింబవళ్లు కష్టించి పనిచేస్తున్నారు. నష్టం తీరును విద్యుత్ శాఖ చీఫ్ జనరల్ మేనేజర్ కిషన్ జిల్లా ఎస్ఈ, డీఈ తదితర అధికారులతో కలిసి పరిశీలించారు.


నష్టాన్ని అంచనా వేస్తున్న అధికారులు

ఈ పరిశీలనలో ఎస్ఈ సరేందర్, డీఈ కృష్ణ, ఏడీఈ అనురాధ, ఏఈ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ముమ్మరంగా విద్యుత్ పనులు

నేలకొండపల్లి: గురువారం రాత్రి మండల పరిధిలోని బుద్దారం తదితర గ్రామాల్లో వీసిన ఉధృతమైన గాలులకు విద్యుత్ వైర్లు తెగిపోవటం, విద్యుత్ స్తంభాలు కూలిపోవటంతో విద్యుత్ అధికారులు యుద్ధప్రాతిపదికన పనులను చేస్తున్నారు. నేలకొండపల్లి విద్యుత్ సిబ్బంది డీఈఈ నాగేశ్వరరావు, ఏడీఈ కోక్యానాయక్, ఏఈఈ రామారావుల పర్యవేక్షణలో విరిగిన పోల్స్ తొలగించి కొత్త పోల్స్ వేశారు. విద్యుత్‌ను పునరుద్ధరించారు.

మోసపోయాననే ఆత్మహత్య చేసుకుంది

● బలవన్మరణం చెందిన యువతి సూసైడ్ నోట్ లభ్యం

ఎర్రుపాలెం జూన్ 14: ఎర్రుపాలెం మండలంలోని మొలుగుమాడు గ్రామంలో ఇటీవల ప్రేమ పేరుతో మోసపోయానని ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న యువతి ఇంట్లో సూసైడ్ నోట్ లభ్యమైందని ఎస్ఐ వెంకటేష్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మొలుగుమాడుకి చెందిన షేక్ రహీన ప్రేమికుడి చేతిలో మోసపోయానని ఇంట్లో ఉరివేసుకొని చనిపోయింది. గతంలో ప్రేమ పేరుతో తనని మోసంచేసి మరొక అమ్మాయిని వివాహం చేసుకున్నాడని, ఎన్టీఆర్ జిల్లా రంగాపురం గ్రామానికి చెందిన ఇస్లావత్ క్రాంతికుమార్‌పై మధిర టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. రిమాండ్‌లో ఉన్న నిందితుడికి బెయిల్ రావటంతో మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకుంది. ఆత్మహత్యకు ముందు తన పుస్తకాలలో సూసైడ్‌నోట్ రాసి చనిపోయింది. మూడు రోజుల తరువాత తన వస్తువులను పరిశీలించగా పుస్తకంలో సూసైడ్ నోట్‌ను తన తండ్రి గమనించి పోలీసులకు సమాచారమిచ్చా డు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వంచకుడి మాటలకే మనస్తాపం: తండ్రి మాబుసాహెబ్

ప్రేమించిన వ్యక్తి తనని మోసంచేశాడని ఒకవైపు కుంగిపోతూ వంచకుడికి శిక్ష పడాల్సిందేనని తన కూతురు రహీన భావించిందన్నారు. కానీ కోర్టు ఆవరణలో తను మంచిదికాదని తనని అనరాని మాటలు అంటూ దూషించిన క్రాంతి మాటలకు తాను మానసిక క్షోభకు గురైందని తండ్రి మాబుసాహెబ్ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. నిందితుడికి బెయిల్ రావటంతో తాను సమాజంలో చులకనౌతానేమోనని నా కూతురు ఈ అఘాయిత్యానికి పాల్పడిందని అన్నారు. బతికినంత కాలం నాపై పడ్డ నిందను చెరుపుకోలేనని రహీన బాధపడిందని ఆయన అన్నారు. క్రాంతికి చట్టరిత్యా శిక్ష పడితేనే రహీన ఆత్మ శాంతిస్తుందని మాబుసాహెబ్ తెలిపారు.

బాలికపై లైంగిక దాడికి యత్నం

మణుగూరుటౌన్, జూన్ 4: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు పట్టణంలో 9 ఏళ్ల బాలికపై లైంగికదాడికి యత్నించిన నిందితుడిని మణుగూరు పోలీసులు అరెస్ట్ చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. డీఎస్పీ రవీందర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం... భద్రాచలం డివిజన్‌లోని తోటపల్లి గ్రామానికి చెందిన గాడిద శ్రీనివాసరావు(40) ప్రభుత్వ సంచార వైద్యశాల 104లో పనిచేస్తున్నాడు. 104 సిబ్బందిని ప్రభుత్వ పీహెచ్‌సీలకు కేటాయించడంతో పినపాక మండలం జానంపేట పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్నాడు. కాగా గురువారం సాయంత్రం 7.30 గంటల సమయంలో మద్యం అలవాటు ఉన్న శ్రీనివాసరావు మణుగూరులోని తన నివాసముండే ఇంటికి సమీపంలో ఉన్న ఓ బెల్ట్‌షాపులో మద్యం సేవించాడు. అనంతరం ఇంటికి వస్తున్న క్రమంలో బయట మెట్లపై కూర్చున్న చిన్నారికి మాయమాటలు చెప్పి మెట్లమీదుగా డాబాపైకి తీసుకువెళ్లి లైంగికదాడికి ప్రయత్నించాడు. చిన్నారి భయంతో బిగ్గరగా ఏడవగా అక్కడే ఉన్న చిన్నారి కుటుంబ సభ్యులు డాబాపైకి వెళ్లి శ్రీనివాసరావును పట్టుకునేందుకు ప్రయత్నించారు. దీంతో అక్కడినుంచి నిందితుడు పారిపోయాడు. వెంటనే చిన్నారి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

బానోత్ రవికి ఉత్తమ రక్తదాత అవార్డు


అవార్డు అందుకుంటున్న రవి

తిరుమలాయపాలెం, జూన్ 14: మండలంలోని ఏనుకుంటతండాకు చెందిన బానోతు రవి ఉత్తమ రక్తదత అవార్డు శుక్రవారం అందుకున్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా హైదరాబాదులో రాజ్‌భవన్‌లో సంస్కృతిక ఆడిటోరియల్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ అవార్డును గవర్నర్ ఆమోదిత ఉత్తమ అవార్డును రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అందించారు. రవి సుమారు 52సార్లు రక్తదానం చేశారు. ఆర్మీ, రెడ్‌క్రాస్ సొసైటీ ఏర్పాటు చేసే పలుమార్లు రక్తదానం శిబిరాలు కూడా చేపట్టారు. ఆర్మీయూత్ పేరుతో ఎన్నోరక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి రక్తదానం అందించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు వెలిగేటి చంద్రమోహన్, డాక్టర్ బాబు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వీరన్న, బోడ మంచానాయక్, పాల్గొన్నారు..

సీజ్, అన్‌క్లైమెడ్ వాహనాలకు 27న వేలం

● భద్రాద్రి జిల్లా ఎంటీవో సుధాకర్‌రావు


ఎంటీవో సుధాకర్‌రావు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూన్ 14: భద్రాద్రి జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో వివిధ కేసుల్లో సీజ్ చేసిన, అన్‌క్లైమెడ్‌గా నిర్ధారించిన 323 వాహనాలను ఎస్పీ రోహిత్‌రాజు ఆదేశాల మేరకు వేలం నిర్వహించనున్నట్లు ఎంటీవో సుధాకర్‌రావు శుక్రవారం తెలిపారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్‌లలో సీజ్ చేసిన, వదిలివేయబడిన వాహనాలను వాటి యజమానులు తిరిగి తీసుకోకపోవడంతో ఈ వాహనాలను జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్ నందు ఉంచామన్నారు. ఇందులో 306 ద్విచక్రవాహనాలు, 17 ఆటో, కార్లు మొత్తం 323 వాహనాలు ఉన్నాయని తెలిపారు. అదేవిధంగా పోలీస్ శాఖకు సంబంధించి కాలం చెల్లిన టైర్లు, బ్యాటరీలు, స్పేర్ పార్ట్సకు ఈ నెల 27వ తారీఖున ఉదయం 10 గంటల నుంచి వేలం పాట జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్ నందు వేలం వేయనున్నట్లు తెలిపారు. వేలం పాటలో పాల్గొనడానికి ఆసక్తి గల వారు 8712682145 నెంబర్‌కి ఫోన్ చేసి సంప్రదించాలని ఎంటీవో కోరారు.

రోడ్డును ఆక్రమించారని రైతుల ఆందోళన

కొణిజర్ల, జూన్ 14: ఓ ఆసుపత్రి యాజమాన్యం రైతుల పొలాలకు వెళ్లే రహదారిని ఆక్రమించి ఫెన్సింగ్ వేశారని మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన కొంత మంది రైతులు శుక్రవారం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువులో అక్రమంగా మట్టి తోలుతూ రోడ్డుని ర్మాణాలు రాత్రికిరాత్రే చేపడుతున్నారని రైతులు ఆనందరావు, శ్రీను, ప్రసాద్, పుల్లయ్య, వెంకటేశ్వర్లు, సంపత్ తదితర రైతు లు ఆవేదన చెందుతున్నారు. అంతేకాకుండ యాజమాన్యం బెదిరిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై కలెక్టర్‌ను కలిసేందుకు సిద్ధం అవుతున్నట్లు రైతులు పేర్కొన్నారు.

నాలుగు ప్రైవేట్ పాఠశాలల బస్‌ల సీజ్


బస్‌ను తనిఖీ చేస్తున్న వైరా ఎంవీఐ

వైరా, జూన్ 14: ప్రైవేట్ పాఠశాలల యజమానులు బస్సుల నిర్వహణలో నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వైరా ఎంవీఐ వరప్రసాద్ హెచ్చరించారు. పాఠశాలల బస్సుల తనిఖీల్లో భాగంగా శుక్రవారం వైరాలో ఫిట్‌నెస్ లేని నాలుగు పాఠశాలల బస్సులను ఎంవీఐ తనిఖీ చేసి సీజ్ చేశారు. ఖమ్మం, కల్లూరు, వైరా, చింతకానిల్లోని నాలుగు ప్రైవేట్ పాఠశాలలకు చెందిన బస్సులు ఫిట్‌నెస్ లేకుండా నడుపుతుండటంతో తనిఖీల్లో ఎంవీఐ వాటిని సీజ్ చేశారు. బస్సులకు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లతోపాటు ఇన్సూరెన్స్ ఫిట్‌నెస్, పొల్యూషన్ అనుమతులు విధిగా ఉండాలని స్పష్టం చేశారు. సామర్థ్యానికి మించి బస్సుల్లో విద్యార్థులను ఎక్కిస్తే చర్యలు తీసుకుంటామని, డ్రైవర్లు రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని ఆదేశించారు.

అగ్నిప్రమాదంలో రూ.3.50లక్షల ఆస్తినష్టం

దుమ్ముగూడెం జూన్ 14: మారాయిగూడెం గ్రామపంచాయతీ పరిధి పత్తిపాకలో శుక్రవారం ప్రమాదవశాత్తు ఉయికా బాలయ్య ఇల్లు పూర్తిగా కాలిబూడిదైంది. ప్రమాదంలో సుమారు రూ.3.50 లక్షల ఆస్తినష్టం కలిగింది. వంట చేస్తున్న క్రమంలో ఒక్కసారిగా వచ్చిన గాలి దుమారంతో మంటలు ఇంటిపైకి ఎగిసిపడడంతో ప్రమాదం జరిగింది. దీంతో ఇంట్లోని రూ30వేల నగదుతోపాటు బంగారు, వెండి వస్తువులు, పట్టాదారు పాస్ పుస్తకాలు, గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. బాలయ్య ఇంటి పరిసరాల వాళ్లు తమ ఇళ్లను హుటాహుటిన నీటితో తడపడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

విద్యుత్ షాక్‌తో పాడి గేదె మృతి

నేలకొండపల్లి, జూన్ 14: మండల పరిధిలోని కట్టుకాచారం గ్రామం సమీపంలో విద్యుత్ షాక్‌తో పాడిగేదె మృతి చెందిన సంఘటన శుక్రవారం జరిగింది. వివరాల ప్రకారం రైతు బాణోతు రామారావుకు చెందిన పాడిగేదె మేతకు వెళ్లి గ్రామానికి సమీపంలోని కృష్ణాజిల్లా తక్కెళ్ళపాడు రహదారి వెంట ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎర్త్ తీగలకు తగిలి విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. గేదె విలువ సుమారుగా రూ.లక్ష ఉంటుందని బాధిత రైతు తెలిపారు.


బోగస్ ఆస్తి పత్రాలతో బురిడీ

» మహిళల సొత్తుతో ఉడాయించిన కేటుగాడు » రూ.2.80 కోట్లతో పరారి


మాట్లాడుతున్న బాధిత మహిళలు

ఖమ్మం చర్చికాంపౌండ్, జూన్ 14: నకిలీ ఆస్తి పత్రాలు కుదువబెట్టి 32 మంది నుంచి రూ.2.80 కోట్లు కొల్లగొట్టి పరారైన క్షత్రియ రవీంద్రనాధ్ సింగ్‌ను పట్టుకుని తమకు న్యాయం చేయాలని బాధిత మహిళలు శుక్రవారం తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఖమ్మం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధిత మహిళలు కనకపుడి లక్ష్మి, ఆళ్ల నాగేంద్రమ్మ, ఎగ్గనంపద్మ, కొనకండ్ల ఉషారాణి, కొనకండ్ల పద్మ తదితరులు మాట్లాడారు. నగరంలోని శాంతినగర్, మిషన్ హాస్పిటల్ రోడ్, పోలీసులైన్ పరిసర ప్రాంతాలకు చెందిన తమ ను ంచి అధిక వడ్డీ ఆశచూపి భారీమొత్తంలో డబ్బుకాజేసిన కేటుగాడి గురించి ప్రజలకు తెలియచేయడంతోపాటు మరే ఇతర మహిళలు మోసగాడి వలకు చిక్కకుండా జాగ్రత్త పరిచేందుకు మీడియా ముందుకు వచ్చామన్నా రు. కనకపుడి లక్ష్మి అనే వృద్ధురాలు మాట్లాడుతూ రవీంద్రనాద్ సింగ్ తన డబ్బు తీసుకుని ఉడాయించడం తో దిక్కులేని స్థితిలో ఉన్నానన్నారు. నాలుగో తరగతి చిరుద్యోగిగా రిటైర్ అయ్యానని తన రిటైర్‌మెంట్ డబ్బుపై కన్నేసిన రవీంద్రనాద్ సింగ్ పథకం ప్రకారం కాజేశాడని వాపోయింది. అతను కుదువబెట్టిన ఆస్తిపత్రాలు తనిఖీ చేయిస్తే అవి ఎందుకు పనికిరాని బోగస్‌పత్రాలుగా తేలాయన్నారు. తమను మోసం చేసి భారీ మొత్తంతో పత్తాలేకుండాపోయిన రవీంద్రనాద్‌సిం గ్‌ను పట్టుకుని తమ కు న్యాయం చేయాలని బాధిత మహిళలు కన్నీ టిపర్యంతమయ్యారు. మోసం చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించి తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

స్వాతంత్ర్య సమరయోధుడు కొత్తా కన్నుమూత


జనార్ధనరావు (ఫైల్)

నేలకొండపల్లి, జూన్ 14: నేలకొండపల్లికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు కొత్తా జనార్ధనరావు (87) శుక్రవారం అనారోగ్యంతో కన్నుమూశారు. మృతుని భార్య సుశీల ఆరు నెలల క్రితం మృతి చెందింది. మృతునికి ముగ్గురు కుమారులు, కుమార్తె ఉండగా ఇరువురు కుమారులు మృతి చెందారు. పాత తరం కాంగ్రెస్‌కు చెందిన కొత్తా జనార్ధనరావు నేలకొండపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా పని చేశారు. భక్త రామదాసు సర్వీస్ సొసైటీ అధ్యక్షునిగా, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షునిగా పని చేసారు. మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావుతో మృతునికి సన్నిహిత సంబంధాలుండేవి. జనార్ధనరావు మృతి సమాచారం తెలుసుకున్న రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు మృతదేహంపై పూలమాలలేసి నివాళులర్పించారు. వివిధ పార్టీలు, ఆర్యవైశ్య సంఘం నాయకులు మేళ్లచెర్వు వెంకటేశ్వర్లు, సూరపనేని రామకృష్ణ, రేగూరి హనుమంతరావు, దోసపాటి చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ రాయపూడి నవీన్, వెల్లంపల్లి శ్రీనివాస్, యలమద్ది లెనిన్, డాక్టర్ నాగబండి శ్రీనివాసరావు, స్వాతంత్ర్య సమరయోధుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వున్నం వెంకయ్య, గెల్లా జగన్మోహన్ రావు, చావా గణపతిరావు, బచ్చలకూరి నాగరాజు, కొత్తా రమేష్, మచ్చా రఘుపతిరావు తదితరులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

ఖననం చేసిన మృతదేహానికి శవపరీక్ష

» 4న ఖమ్మంలో ఆత్మహత్య చేసుకున్న గంగారం వాసి
» తల్లిదండ్రుల ఫిర్యాదుతో అనుమానాస్పద కేసుగా నమోదు

సత్తుపల్లిరూరల్, జూన్14: సత్తుపల్లి మండలం గంగారం గ్రామంలోని జలగం నగర్-2కు చెందిన బండారి విజయకుమార్ (38) ఈనెల 4న ఖమ్మంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి బాబు ఫిర్యాదు మేరకు ఖమ్మం నుంచి వచ్చిన పోలీసులు శుక్రవారం ఖననం చేసిన మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గంగారం గ్రామానికి చెందిన విజయకుమారితో 8ఏళ్ల క్రితం తల్లిదండ్రులు వివాహం చేయగా కొన్నేళ్ల క్రితం ఖమ్మంలోని రమణగుట్ట ఏరియాలో అద్దెకు విజయకుమార్ భార్యతో కలిసి ఉంటున్నాడు. రాళ్లు కొట్టే పనికి కోదాడ సమీపంలోకి వెళ్లివస్తుండగా కారణం తెలియదుకానీ ఈనెల 4న అద్దెకు ఉంటున్న ఇంటిలో ఉరివేసుకుని విజయకుమార్ ఆత్మహత్య చేసుకోగా బంధువులు తర్వాతి రోజు స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ క్రమంలో కుమారుడు మృతిపై అనుమానాలు రావడంతో ఖమ్మం టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో తండ్రి బాబు 11న ఫిర్యాదు చేయగా అక్కడి ఎస్ఐ జీ.సూరజ్, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడు రాథోడ్ వినాయక్, సత్తుపల్లి తహసీల్దార్ యోగేశ్వరరావుల ఆధ్వర్యంలో మట్టి దహనం చేసిన మృతదేహానికి శ్మశానంలో శవపరీక్ష నిర్వహించారు.


మృతదేహాన్ని బయటకు తీస్తున్న అధికారులు

తల్లాడ బస్టాండ్‌లో గుర్తుతెలియని మహిళ మృతదేహం


గుర్తుతెలియని మహిళ మృతదేహం

తల్లాడ, జూన్ 14: తల్లాడ బస్టాండ్‌లో శుక్రవారం తెల్లవారుజామున గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. సమాచారం తెలుసుకున్న తల్లాడ ఎస్ఐ బి.కొండల్‌రావు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది అక్కడకు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని అన్నం ఫౌండేషన్ ఛైర్మన్ అన్నం శ్రీనివాసరావు సహకారంతో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. సుమారు 40సంవత్సరాలు వయస్సు కల్గిన మతిస్థిమితం లేని మహిళగా పోలీసులు గుర్తించారు. లేత బూడిద రంగు ఆకుపచ్చ అంచు కలిగిన చీర, నలుపురంగు జాకెట్ ధరించి ఉంది. ఈ మహిళ రెండురోజుల క్రితం కల్లూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స కోసం వెళ్లినట్లు ఓపీ చీటిలో లక్ష్మీ అనే పేరు నమోదు చేసి ఉంది. ఈ మహిళ ఆచూకీ ఎవరికైనా తెలిస్తే వెంటనే తల్లాడ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని ఎస్ఐ తెలిపారు. ఈమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు, మహిళ ఆచూకీ తెలిసిన వారు తల్లాడ ఎస్ఐ సెల్‌నెంబర్ 8712659154లో సంప్రదించాలని సూచించారు.

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

ఖమ్మంక్రైం, జూన్14: మహిళ మెడలో బంగారుగొలుసు గుర్తు తెలియని దుండగుడు చోరీచేసిన సంఘటన శుక్రవారం ఖమ్మం నగరంలో జరిగింది. నగరంలోని రోటరీనగర్‌కు చెందిన లక్ష్మి అనే మహిళ తన ఇంటి వద్ద కిరాణ షాపు నడుపుతుంది. గుర్తు తెలియని వ్యక్తి కిరాణషాపు వద్దకు వచ్చి పెరుగు ప్యాకెట్ కావాలని అడిగాడు. దీంతో సదరు మహిళ పెరుగుప్యాకెట్ ఫ్రిజ్‌లో నుంచి తీసి ఇస్తుండగా మహిళ మెడలోని బంగారు గొలుసును లాక్కుని ద్విచక్రవాహనంపై పరారయ్యాడు. దీంతో బాధితులు టుటౌన్ పోలీసులకు సమాచారం అందించగా వారు వచ్చి పరిశీలించారు. చోరీకి గురైనబంగారు గొలుసు సుమారు రెండున్నర లక్షల వరకు ఉంటుందని బాధిత మహిళ తెలిపారు.

5.8కిలోల గంజాయి పట్టివేత

ములకలపల్లి, జూన్ 14: ములకలపల్లి గ్రామశివారు శివాలయ సమీపంలో ఎస్ఐ రాజమౌళి తన సిబ్బందితో శుక్రవారం వాహన తనిఖీ నిర్వహిస్తుండగా రింగిరెడ్డిపల్లి గ్రామం నుంచి ములకలపల్లికి ఆటోలో వస్తున్న వేణు అనే వ్యక్తి వద్ద నుంచి 5కేజీల 800 గ్రాముల గంజాయిని పట్టుకున్నారు. గంజాయి విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని ఎస్ఐ తెలిపారు. ఆటోను సీజ్ చేసి ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ గంజాయిని ఎవరు విక్రయించిన నిల్వ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు.



బచ్చువారిగూడెంలో ప్రత్యేక వైద్యశిబిరం

అశ్వారావుపేట రూరల్, జూన్ 14: మండలంలోని బచ్చువారిగూడెం గ్రామానికి శుక్రవారం వైద్యశాఖ, తాగునీటి సరఫరా విభాగం అధికారులు కదిలారు. గ్రామంలో అనేక మంది కీళ్ల, కండరాల నొప్పులతో బాధపడుతున్న నేపథ్యంలో శుక్రవారం 'ఊరంతా కీళ్ల నొప్పులే' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం వెలువడింది. దీనికి స్పందించిన గుమ్మడివల్లి వైద్యశాల సిబ్బంది గ్రామానికి తరలారు. గ్రామంలో ప్రత్యేక వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలో నొప్పులతో బాధపడుతున్న వారికి వైద్యులు వెంకటేష్ పరీక్షలు చేసి మందులు అందించారు. 11 మంది రక్తపూతలు సేకరించి టీ హబ్‌కు పంపించారు. గ్రామంలో ఇంటింటికి తిరిగి పరిస్థితిని సమీక్షించారు. నొప్పులతో బాధపడుతున్న వారికి ఆరోగ్య పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. తాగునీటి సరఫరా విభాగం ఏఈ లక్ష్మీ గ్రామాన్ని సందర్శించారు. వైద్యసిబ్బందితో కలిసి గ్రామంలో పర్యటించారు. పరీక్షల నిమిత్తం నీటి నమూనాలను సేకరించారు.

శ్మశానవాటికలు పూర్తికావా..?

బ్రిడ్జీలు లేక ప్రజల అవస్థలు



శిథిలావస్థలో బ్రిడ్జి



పిచ్చి మొక్కలతో నిండిన బర్నింగ్ ప్లాట్‌ఫాం

ఇల్లెందుటౌన్, జూన్ 14: ఏళ్లు గడిచిపోతున్న శ్మశానవాటిక భవన నిర్మాణాలు మాత్రం పూర్తి కావడం లేదు. లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మాణాలు చేపట్టిన శ్మశానవాటిక భవనాలు అసంపూర్తిగానే మిగిలిపోయాయి. ఇల్లెందు పట్టణంలోని రెండో వార్డు ఇల్లెందుపాడు చెరువు సమీపంలో ఉన్న స్మశానవాటికను అభివృద్ధి చేసేందుకు ఇల్లెందు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో 2021-22, 14వ ఫైనాన్స్ నిధులు రూ. 25లక్షలతో శ్మశానవాటికలో బర్నింగ్‌ప్లాట్‌ఫాం, స్నానాలగదులు, కర్మకాండ నిర్వహణకు బిల్డింగ్ నిర్మాణం, నీటి పంపులు, నీటి తొట్లు నిర్మాణం చేసేందుకు అధికారులు శ్రీకారం చుట్టారు. ఈ స్మశానవాటిక చుట్టు బౌండరి నిర్మాణం చేయాల్సి ఉండగా శ్మశానాటిక సమీప రైతులతో పలు దఫాలుగా వివాదస్పద ఘర్షణలు సైతం చోటుచేసుకున్నాయి. శ్మశాన వాటిక బౌండరీ ఏర్పాటు కోసం కొంతకాలం గడిచిపోగా మరికొంతకాల నిర్మాణాలకే సరిపోయింది. శ్మశానవాటిక చుట్టు బౌండర్ ఏర్పాటు కోసం మున్సిపల్ అధికారులు, రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు చర్చలు జరిపిబౌండరీ ఏర్పాటు చేసినప్పటికీ ఇప్పటి వరకు చుట్టు కంచె నిర్మాణం సాగలేదు. మంజూరైన రూ.25లక్షల్లో ఇప్పటి వరకు రూ.12లక్షల మేరకు ఖర్చు చేసి బర్నింగ్‌ప్లాట్‌పాం, కర్మకాండ భవనాలు నిర్మాణాలు చేసినప్పటికీ అసంపూర్తిగానే ఉన్నాయి. అంతేకాకుండ స్మశానవాటికక వెళ్లే రహదారిపై తాగునీటి చెలుగులలుగు బ్రిడ్జి ఉండగా గత రెండు సంవత్సరాల క్రితం భారీ వర్షాలకు కొట్టుకుపోయింది. దహన సంస్కారాలకు వెళ్లాలంటే ఈ బ్రిడ్జినే ముఖ్యంగా ఉపయోగపడుతుంది. వర్షాకాలం సీజన్‌లో శవదహనానికి శ్మశానవాటికకు వెళ్లాలంటే చనిపోయిన వ్యక్తి బంధువులు, కుటుంబ సభ్యులకు ఇబ్బందులు తప్పడం లేదు. శ్మశానవాటికలకు ఆధునీకరించాలనే ప్రభుత్వ సంకల్పానికి స్థానిక అధికారులు, కాంట్రాక్టర్లు తూట్లు పొడస్తున్నారనే విమర్శలు వినిపిస్తోన్నాయి. నిర్మాణాలకు ఉపయోగించే నిధులు సంవృద్ధిగా ఉన్నప్పటికీ సదరు కాంట్రాక్టర్ స్మశానవాటక బౌండర్ ఏర్పాటు చేయలేదనే సాకుతో తమ పనులను నిలిపివేశారు. పనులు సకాలంలో పూర్తి కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బ్రిడ్జి నిర్మాణం సాగకపోవడంతో అటు వెళ్లాలంటే ప్రజల అవస్థలు అన్నీఇన్నీ కావు.

బౌండరీ లేని కారణంగా ఆగిన నిర్మాణాలు: ఏఈ

ఇల్లెందుపాడు శ్మశానవాటిక బౌండరీ ఏర్పాటు వివాదంగా ఉందని ఏఈ కుమారస్వామి తెలిపారు. బౌండరీ లేని కారణంగానే పనులు నిలిచిపోయాయని తెలిపారు. చుట్టు రక్షణ లేకుంటే పనులు సాగవని లేవని ఆయన పేర్కొన్నారు.

బడిబాట.. సామూహిక అక్షరాభ్యాసం



దుస్తులు, పాఠ్య పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే

మణుగూరుటౌన్, జూన్ 4: మణుగూరు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం జరిగిన బడిబాట.. సామూహిక అక్షరభ్యాస కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాపూజీనగర్, ఉడతానిగుంపు ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలల్లోని విద్యార్థులకు ఏకరూప దుస్తులతోపాటు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్‌లను పంపిణీ చేశారు. చిన్నారులకు అక్షరాలను దిద్దించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ.. బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని చిన్నారుల తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమాల్లో ఎంఈవో వీరాస్వామి, ఈఓఆర్డీ పల్నాటి వెంకటేశ్వర్లు, అధికారులు, ఆయా పాఠశాలల సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

కరగూడెంలో..

కరకగూడెం: బడిబాట కార్యాక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని పోలకమ్మతోగు పాఠశాలలో విద్యార్థులతో సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని ఎంఈవో వీరస్వామి చేయించారు. అనంతరం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్ అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజలు తమ వంతు సహకారాన్ని అందించాలని కోరారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే విధంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ ఆఫీ సర్ మంజుల, ఆశ్రమ పాఠశాల హెచ్ఎం జగన్, మాజీ సర్పంచ్ నరసింహారావు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా విద్యాబోధన

జూలూరుపాడు: ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వం విద్యాబోధన అందిస్తుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని మండల విద్యాశాఖాధికారి గుగులోత్ వెంకట్ కోరారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జూలూరుపాడు ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటుచేసిన సామూహిక అక్యరాభ్యాస కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. విద్యార్థులకు దుస్తులు, పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనర్సయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నేతాజీ పాల్గొన్నారు.

విద్యతోనే బంగారు భవిష్యత్తు

ఇల్లెందురూరల్: విద్యతోనే ప్రతీ ఒక్కరికి బంగారు భవిష్యత్తు లభిస్తుందని కొమరారం ఎస్ఐ సోమేశ్వర్ అన్నారు. శుక్రవారం ఇల్లెందు మండలంలో భద్రుతండా ప్రభుత్వ పాఠశాలలో జరిగిన బడిబాట కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకట్రాం, శ్రీకాంత్, కిషన్, అంగన్‌వాడీ టీచర్ విజయ, గ్రామస్థులు జేకే.భంగీ, కౌసల్య పాల్గొన్నారు.

టూ వీలర్ మెకానిక్‌లకు ఐడీ కార్డులు



ఐడీ కార్డులు అందజేస్తున్న ఎస్ఐ రాము

పాల్వంచ, జూన్ 14: పాల్వంచ పట్టణంలోని టూ వీలర్ మెకానిక్‌లకు అసోసియేషన్ వారు ఐడీ కార్డులను జారీ చేశారు. శుక్రవారం పాల్వంచలో టూ వీలర్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో పాల్వంచ టౌన్ ఎస్ఐ బానాల రాము ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఆయన చేతుల మీదుగా మెకానిక్‌లకు ఐడీ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రతి మెకానిక్‌కు ఐడీ కార్డులు జారీ చేయాలనే ఆలోచన అసోసియేసన్ పెద్దలకు రావడం అభినందించదగ్గ విషయమన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి



మాట్లాడుతున్న కంచర్ల చంద్రశేఖర్‌రావు

చుంచుపల్లి, జూన్ 14: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చుంచుపల్లి మండలంలో ముందస్తు చర్యలు చేపట్టాలని భద్రాద్రి జిల్లా జెడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు సూచించారు. శుక్రవారం మండలం ప్రజా పరిషత్ కార్యాలయంలో పెనగడప ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య బృందంచే సీజనల్ వ్యాధులు, చర్మవ్యాధులు, డివామింగ్ కార్యక్రమాలపై ప్రత్యేక అధికారులు, మండల స్థాయి అధికారులతో జరిగిన అవగాహన సదస్సులో ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీలలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు అన్ని చర్యలు చేపట్టి ప్రజలు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండే విధంగా చూడాలన్నారు. ప్రజలు ముందస్తుగా ఎలాంటి రక్షణ చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరిసరాల - వ్యక్తిగత పరిశుభ్రత అంశాలపై వైద్య విభాగం వారు కరపత్రాన్ని ముద్రించి గ్రామాలలో పంపిణీ చేస్తే ప్రజలందరికి అవగాహన కలుగుతుందన్నారు. తద్వారా సీజనల్ వ్యాధుల భారీన పడకుండా ఉంటారని సూచించారు. అనంతరం మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు బాదావత్ శాంతి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చుంచుపల్లి మండల ప్రత్యేక అధికారి బి.సులోచన రాణి, ఎంపీడీవో అశోక్‌కుమార్, ఎంపీవో సత్యనారాయణ, పెనగడప పీహెచ్‌సీ డాక్టర్లు జి.వాణి, నేహాఅఫ్రిన్, ఏపీఎం బి.రామకృష్ణ, వెటర్నరీ డాక్టర్ ఆనంద్‌రావు, అగ్రికల్చర్ ఏవో రాజేశ్వరి పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



అన్నదానంలో పాల్గొన్న నాయకులు

అశ్వారావుపేట, జూన్ 14: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా పవన్ కళ్యాణ్ ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా అశ్వారావుపేటలోని అమ్మా సేవా సదనంలో మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పేదల కోసం నిరంతరం తపించే పవన్ కళ్యాణ్ ప్రమాణ స్వీకారం చేయటం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ సంబురాలు జరిపి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కో ఆర్డినేటర్ యూఎస్.ప్రకాశరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జీ డేగల రామచంద్రరావు, నాయకులు నాగబాబు నాయులు, రవి, ఏసుబాబు, కొట్టే శ్రీను, కట్టా శ్రీను, గోపాలకృష్ణ, సుబ్బు, కోటా బాలు, నరేశ్, తిరుమల శెట్టి అప్పారావు, శ్రీను, బండి సురేశ్, కొల్లు రమేశ్, శరత్, సురేశ్, సాయి, ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

పట్టాల మార్పిడిపై చర్యలు తీసుకోవాలి



వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

దమ్మపేట, జూన్, 14: గిరిజన చట్టాలకు విరుద్ధంగా భూ అక్రమ పట్టాల మార్పిడిలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేపీ మండల అధ్యక్షుడు జుజ్జూరి చెన్నారావు ఆధ్వర్యంలో తహసీల్దార్ నరేష్‌కు శుక్రవారం వినతి పత్రం అందజేసారు. గిరిజన చట్టాలను విరుద్ధంగా ఇచ్చిన పట్టాదారు పాస్ పుస్తకాలను రద్దుచేయాలని గతంలో దొంగ పాస్‌పుస్తకాల ద్వారా భూములు పట్టాలు పొందిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

సమస్యలపై పోరాడిన ఈయూ



నినాదాలు చేస్తున్న నాయకులు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూన్ 14: ఆర్టీసీ కార్మికుల సమస్యలపై పోరాడిన ఏకైక యూనియన్ ఎంప్లాయిస్ యూనియన్ (ఈ.యూ) అని సీనియర్ నాయకులు ఎస్.ఆర్.బాబు తెలిపారు. శుక్రవారం కొత్తగూడెంలో డిపో ప్రాంగణంలోని ఏఐటీయూసీ అనుబంధ ఈయూ రాష్ట్ర కమిటీ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం యూనియన్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించగా జెండా ఎగురవేసి మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో 1958 సంవత్సరంలో యూనియన్ ఏర్పడి కార్మిక సమస్యలు పరిష్కారంలో ముందు వరుసలో ఉన్నామని కొనియాడారు. అనేక వేతన సవరణలు, కార్మికుల వెల్ఫేర్ చేస్తూ 30 సంవత్సరాలు పైబడి గుర్తింపు సంఘముగా కొనసాగి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో కదంతొక్కి. సకల జనుల సమ్మెలో పాల్గొన్నామని గుర్తు చేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధించుకోవడంలో ఈయూ పోరాడిందన్నారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని, యూనియన్ పునరుద్దరణచాలని కోరారు. 2013 బాండ్ డబ్బులు చెల్లించాలని, 2021 వేతన సవరణ అమలు చేయాలని, లేని పక్షంలో 50 శాతం ఐఆర్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈయూ రాష్ట్ర కార్యదర్శి కె.భాస్కరరావు, డిపో కార్యదర్శి ఆర్.ఎస్.సింగ్, యూనియన్ నాయకులు జి.ఆర్.బాబు, సైమాన్, శ్రీను, గ్యారేజ్ సిబ్బంది రవి, నరేష్, గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలి

అశ్వాపురం, జూన్ 14: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని, బడిఈడు పిల్లలందరినీ ప్రభుత్వబడుల్లోనే చేర్పించాలని ఎంపీపీ ముత్తినేని సుజాత అన్నారు. శుక్రవారం అశ్వాపురం, జగ్గారం ప్రభుత్వ పాఠశాలల్లో జరిగిన అమ్మ ఆదర్శ పాఠశాల బడిబాట కార్యక్రమంలో ఎంపీపీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిల్లలకు అక్షరాలు దిద్దించి, పాఠ్య, నోట్ పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో వరప్రసాద్, స్పెషల్ ఆఫీసర్ వీరన్న, ప్రధానోపాధ్యాయుడు భాస్కరసూరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భద్రతా ప్రమాణాలు పాటించాలి

దుమ్ముగూడెం, జూన్ 14: క్షేత్రస్థాయి విధులు నిర్వర్తిస్తున్న విద్యుత్ సిబ్బంది భద్రతా ప్రమాణాలను పాటించాలని మండల విద్యుత్‌శాఖ ఏఈ మోహన్‌రెడ్డి సూచించారు. ప్రతీ ఒక్క ఉద్యోగి విధుల్లోకి వెళ్లే ముందు భద్రతా పరికరాలను తమవెంట ఉండేలా చూసుకోవాలని కోరారు. దుమ్ముగూడెం విద్యుత్ సబ్-స్టేషన్‌లో శుక్రవారం ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సబ్-ఇంజనీర్ రాజేష్ తదితరులున్నారు.

పీజీ డిప్లొమా అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

చుంచుపల్లి, జూన్14: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ (ఎన్ఏసీ) ఆధ్వర్యంలో పీజీ డిప్లమా 2024 - 25 ఏడాదికి గాను అడ్మిషన్ల కోసం దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ) వెంకటరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటిలో రెండు కోర్సులు ఉండగా వాటిలో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లమా ఇన్ ప్రాజెక్ట్ మేనేజ్మెంట్ (అర్హత బీఈ, బీటెక్ సివిల్ అండ్ బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్) పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లమా ఇన్ క్వాంటిటి సర్వేయింగ్ అండ్ కాంట్రాక్ట్ మేనేజ్మెంట్ (అర్హత బీఈ, బీటెక్ సివిల్ అండ్ బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్ అండ్ మెకానిక్) ఉండాలన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు చివరి తేదీ వచ్చే నెల జూలై 10వ తేదీ అని, పరీక్ష అదే నెల 19వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఏడీ తెలిపారు.

కార్మికుల వేతనాలు పెంచాలి



వినతిపత్రం అందజేస్తున్న కొత్వాల

పాల్వంచ టౌన్, జూలై 14: పాల్వంచ మున్సిపాలిటీలో చాలీచాలనీ జీతాలతో గత 25 సంవత్సరాలుగా ఔట్‌సోర్సింగ్ కార్మికులుగా పని చేస్తున్న కార్మికుల వేతనాలను పెంచేలా ఉన్నతాధికారులకు సిఫారుస చేయాలని డీసీఎంఎస్ ఛైర్మన్, జిల్లా కాంగ్రెస్ కొత్వాల శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపాలిటీ కార్యాలయంలో కమిషనర్ స్వామికి కొత్వాలతోపాటు కార్మికులు, కాంగ్రెస్ నాయకులు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్న తరుణంలో కార్మికులకు చెల్లించే చాలీచాలని జీతాలతో వారి కుటుంబాలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి వేతనాలు పెంచాలా ఉన్నతాధికారులకు సిఫార్సుల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ ఎ. స్వామి, ఎఈ రాజేష్, శానిటరి ఇన్‌స్పెక్టర్ లక్ష్మణరావు, పాల్వంచ మాజీ జడ్పీటీసీ సభ్యుడు యర్రంశెట్టి ముత్తయ్య, ఔట్‌సోర్సింగ్ కార్మికులు బి.నరేష్, అక్బర్, జానీ, పవన్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యకు ప్రాధాన్యమిస్తా: ఎమ్మెల్యే జారే



విద్యాభ్యాసం చేయిస్తున్న ఎమ్మెల్యే జారే

దమ్మపేట, జూన్ 14: అశ్వారావుపేట నియోజకవర్గంలో తొలిప్రాధాన్యత విద్యకు ఇస్తానని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. బడిబాట కార్యక్రమంలో చలమప్పగూడెం ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం సామూహిక విద్యాభ్యాసంలో భాగంగా చిన్నారులతో ఎమ్మెల్యే అక్షరాలు దిద్దించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు తాను తొలి ప్రాధాన్యతకు విద్య, వైద్యానికి ఇవ్వటం జరుగుతుందన్నారు. తనకు వచ్చిన నిధులలో పాఠశాలల్లో మౌలిక సధుపాయాల కోసం రెండు కోట్ల రూపాయిలు కేటాయించానని పాఠశాలల్లో ప్రస్తుతం పనులు జరుగుతున్నాయన్నారు. ఎక్కడైతే ఎక్కువగా విద్యాధికులు ఉంటారో ఆ ప్రాంతం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందన్నారు. నియోజకవర్గంలో జూనియర్ కళాశాలలు, ఇండోర్ స్టేడియం, స్పోర్ట్స్ పాఠశాల ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అదేవిధంగా ఆశ్రమపాఠశాలల అనుబంధంగా జూనియర్ కళాశాలల ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలకు తొలిరోజును ప్రభుత్వం పాఠ్యపుస్తకాలు, దుస్తులు అందజేస్తున్నట్లు తెలిపారు. అంతకు ముందు పాఠశాల ఆవరణలో వున్న సరస్వతి విగ్రహానికి పూలమాలలు వేసి విద్యాభ్యాసం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సోయం ప్రసాదు, జడ్పీటీసి పైడి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపి దారా మల్లికార్జునరావు, ఎంపీడివో చంద్రశేఖర్, ఎంఈవో లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పలు సమస్యలపై ఎమ్మెల్యేకు విజ్ఞప్తులు

అశ్వారావుపేట నియోజక పరిధిలోని పలుమండలాలకు చెందినవారు సమస్యలపై గండుగులపల్లిలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణనను కలిసి వినతులు అందజేసారు. అశ్వారావుపేట మండలం బండారుగుంపు, చంద్రుగొండ మండలం మద్దుకూరు గ్రామాలకు చెందిన పలువురు గిరిజనులు ఎమ్మెల్యేను కలిసి పోడు సమస్యలు పరిష్కరించాలని, మరికొందరు ఆరోగ్య సమస్యలపై తెలిపారు. సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

గిరిజన గ్రామాల్లో వైద్యశిబిరాలు

అశ్వారావుపేట రూరల్, జూన్ 14: మండలంలోని వినాయకపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అత్యంత మారుమూల గిరిజన గ్రామం మొద్దులమడ, గుమ్మడివల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కొండతోగు గిరిజన గ్రామంలో శుక్రవారం ప్రత్యేక వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరంలో వైద్యులు కృష్ణదీపకరెడ్డి, వెంకీ గిరిజనులకు పరీక్షలు చేసి మందులు అందించారు. రోగులకు అవసరమైన మందులను అందించి ఆరోగ్యపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్రీనివాస్, ఆరోగ్యసిబ్బంది సత్యనారాయణ, హెచ్‌వీ దుర్గమ్మ, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఆత్మ గౌరవ కవాత్‌ను జయప్రదం చేయాలి

భద్రాచలం, జూన్ 14: వరంగల్‌లో జూలై 7న జరిగే ఆత్మ గౌరవ కవాత్‌ను జయప్రదం చే సేందుకు ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, ఎంఎంఎస్, ఎంఎస్ఎఫ్ అన్ని విభాగాల కమిటీలు కృషి చేయలని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు అలవాల రాజా కోరారు. భద్రాచలంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 22 నుంచి 30 వరకు పట్టణ, మండల కమిటీలను పూర్తి నిర్మాణం చేపట్టాలని, ఒకటిన మండల సన్నాహక కవాతులు నిర్వహించి అన్ని విభాగాలకు జూలై 3న పూర్తిస్థాయి జిల్లా కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. 5న సన్నాహక కవాతు, 6న ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండాలను ఆవిష్కరించాలన్నారు. ఆత్మ గౌరవ కవాత్ జయప్రదానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెల్లం సమ్మక్క, కంచర్ల కుమారి, గుండె సుహాసిని, కోట ప్రభాకర్, పింగిలి నాగరాజు, బచ్చలకూర జానీ పాల్గొన్నారు.

డయాలసిస్ సేవలు అందక రోగుల ఇక్కట్లు



ఇల్లెందులోని డయాలసిస్ కేంద్రం

ఇల్లెందుటౌన్, జూన్ 14: ప్రభుత్వ వైద్యశాలలో కిడ్నీ రోగులకుఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రం గత ఆరు రోజులుగా చికిత్సలు అందకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. ప్రభుత్వ వైద్యశాలలో ఏర్పాటుచేసిన డయాలసిస్ కేంద్రం షార్ట్‌సర్క్యూట్‌కు గురై డయాలసిస్ పరికరాలు కాలిపోయాయి. దీంతో గత సోమవారం నుంచి ఇల్లెందు వైద్యశాలలో డయాలసిస్ సేవలు నిలిచిపోవడంతో కిడ్నీ బాధితులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇల్లెందు కేంద్రంలో 42మంది కిడ్నీ రోగులు డయాలసిస్ చేయించుకుంటున్నారు. చికిత్సలు నిలిచిపోవడంతో వీరిని మహబూబాబాద్, ఖమ్మం, అశ్వారావుపేట ప్రభుత్వ వైద్యశాల కేంద్రాలకు విభజించారు. ఇల్లెందుకు మహబూబాబాద్, ఖమ్మం కొద్దిదూరం అయినప్పటికీ అశ్వరావుపేట సుదూర ప్రాంతంలో ఉండటంతో కిడ్నీ రోగులంతా ఎక్కువ శాతం ఖమ్మం వైద్యశాలకు తరలిపోవడంతో అక్కడి వైద్యులు డయాలసిస్ చేయలేక ఇబ్బందుల పాలవుతున్నారు. ఎక్కువ మంది తమ వద్దకు వస్తే సేవలు ఎలా అందిస్తారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలకేంద్రంలో ఉన్న డయాలసిస్ పరికరాలను ఏర్పాటు చేసిన సంబంధిత కంపెనీ అధికారులు మాత్రమే మరమ్మతులు చేయాల్సి ఉంది. వారి కంపెనీ ప్రతినిధులు ఢిల్లీ నుంచి మైనటరింగ్ చేస్తూ మరమ్మతులు చేసేందుకు తీవ్ర ప్రయత్నాలు సాగిస్తున్నారు. డయాలసిస్ పరికరాల మరమ్మతులు మరో మూడు, నాలుగు రోజులు పట్టే అవకాశం ఉందని స్థానిక వైద్యులు పేర్కొంటున్నారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్ పంపిణీ చేసిన ఆధార్ సంస్థ

కరకగూడెం, జూన్ 14: మండలంలోని పద్మాపురం పంచాయితీ నీలాద్రిపేట వలస ఆదివాసీ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలోని విద్యార్థులకు శుక్రవారం హైదరాబాద్ సమిష్టి సహస్ర సహకారంతో ఆధార్ సంస్థ డైరెక్టర్ తోలెం రమేష్ స్కూల్ బ్యాగ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పిల్లలను ప్రతి రోజు అంగన్‌వాడీ కేంద్రానికి పంపించాలని ప్రీ స్కూల్ కార్యక్రమాల ద్వారా పిల్లల్లో నైపుణ్యం పెరుగుతుందని విద్యార్థుల తల్లితండ్రులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ స్వర్ణలత, పాఠశాల ఉపాధ్యాయులు కుమారస్వామి, ఆధార్ సంస్థ సభ్యులు బట్ట బిక్షపతి, రాజబాబు, గ్రామస్థులు సోడి, మాడారం, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.